Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 14.08.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 11 పేజీలు : 12, వెల : ₹ 5


ISO 9001-2008
Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్


వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



శుభాకాంక్షలు

పాఠకులకు, ప్రకటనకర్తలకు,
చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. సం/-

## నగరం... గోవిందనామమయం



- కనులపండువగా శ్రీవారి వైభవోత్సవాలు
- ధన్యుడు... వేమిరెడ్డి ప్రభాకరుడు

6,7లో



### బీజేపీ - టీడీపీల మధ్య పెరిగిన అంతరం

### ప్రత్యేకహోదాపై తాడో పేడో

## తేల్చుకుంటాడా? తెంచుకుంటాడా?

'ప్రత్యేకహోదా' చిచ్చు రాష్ట్ర ప్రభుత్వాన్ని అతలాకుతలం చేస్తోంది. తిరుపతిలో కాంగ్రెస్ కార్యకర్త మునికోటి ఆత్మహత్యతో ఇది బాగా రగులుకుంది. టీడీపీ, బీజేపీలు మినహా మిగిలిన విపక్షాలన్నీ కూడా ప్రత్యేకహోదాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బాగానే తగులుకున్నాయి. రాష్ట్ర విభజనలో ప్రధాన పాపి కాంగ్రెస్‌పార్టీ. ఆంధ్రప్రదేశ్ విభజన ఆ పార్టీని చారిత్రాత్మక దోషిగా నిలబెట్టింది. ఆరోజు విభజన బిల్లులోనే ప్రత్యేకహోదా అంశాన్ని ఆ పార్టీ చేర్చి వుంటే ఈరోజు ఇన్ని సమస్యలుండేవి కాదు. ఆరోజు రాష్ట్రాన్ని తగలబెట్టింది కాంగ్రెస్‌పార్టీయే. అప్పుడు చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం అన్నట్లుగా ప్రత్యేకహోదాపై ఇప్పుడు కాంగ్రెస్ ఆందోళనలు చేస్తోంది. ఎన్ని ఉద్యమాలు చేసినా కాంగ్రెస్ ద్రోహాన్ని రాష్ట్ర ప్రజలు అంత సులభంగా మరచిపోలేరు.

అయితే ప్రత్యేకహోదాపై రాష్ట్రంలో పెరుగుతున్న ఆందోళనలు చంద్రబాబును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ విషయంలో ఆయనది ముందు నుయ్యి వెనుక గొయ్యి పరిస్థితి. ప్రత్యేకహోదాపై కేంద్రంతో తగవు పెట్టుకోలేడు, అలాగని రాష్ట్రంలో విపక్షాలకు సమాధానం చెప్పలేడు. ప్రత్యేకహోదా కేవలం రాజకీయ అంశమే కాదు, ప్రజలు కోరుకుంటున్న అంశం కూడా! విభజన మూలంగా

(మిగతా 11వ పేజీలో)

రేపటి నుండి...
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
FREEDOM SALE
FLAT 50% off | FLAT 30% off
అన్ని రకాల వస్త్రాలపై
(3 రోజులు మాత్రమే)
ఆంధ్రప్రదేశ్
కళానికేతన్ షాపింగ్ మాల్
ట్రంక్ రోడ్, గాంధీనగర్, నెల్లూరు. ఫోన్. 2316677
*Conditions Apply.
doocreative.com



### ప్రజాసమస్యలపై పోరాటంలో తండ్రిని తలపిస్తున్న తనయుడు

## వేగం పెంచిన జగన్!

చేపలు తినడానికంటే ముందు పిల్లలకు చేపలు పట్టడం నేర్పించాలంటారు. కష్టపడేతత్వం, పోరాడే వ్యక్తిత్వముంటే ఎవరు ఎక్కడైనా ఎప్పుడైనా రాణించగలరు. మరీ ముఖ్యంగా రాజకీయాలలో నేరుగా పదవులను అలంకరించే వారు పెద్దగా రాణించలేరు. ఎందుకంటే వారికి ప్రజల సమస్యలు తెలియవు. క్రింది స్థాయి కార్యకర్తల మనోభావాలు పట్టవు. కాబట్టి నాయకుడనేవాడు కార్యకర్త స్థాయి నుండి ఎదగాలి. కార్యకర్తలు, ప్రజల మనసులను తెలుసుకుంటూ వారి మనోభావాలకు తగ్గట్లుగా నడుచుకునే వాడే ప్రజా నాయకుడు కాగలడు.

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి ప్రజాదేవుళ్లు ఇచ్చిన గొప్ప అవకాశం చిన్నవయసులోనే ప్రతిపక్ష నేత కావడం. చిన్నవయసులో సీఎంలు అయినవాళ్లున్నారుగాని, ప్రతిపక్ష నాయకులైన వాళ్లు తక్కువ. సీఎం కంటే కూడా ప్రతిపక్ష నేత పాత్ర చాలా ఎక్కువ. ఒక వ్యక్తిలోని నాయకత్వ లక్షణాలు, పోరాటపటిమ బయటపడేది ఇక్కడే! 2014 ఎన్నికల్లో అధికారంలోకి రాలేక పోయినందుకు జగన్ బాధపడి ఉండొచ్చు. అయితే

(మిగతా 11వ పేజీలో)

# ప్రశాంత నెల్లూరులో... అశాంతి జాడలు

• పెచ్చుమీరుతున్న దోపిడీలు... దొంగతనాలు • నిఘా పెంచి నిలువరించాలి



**ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరులో అశాంతి జాడలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఎక్కడో చోట దొంగతనాలు, దోపిడీలు, చైన్‌స్నాచింగ్‌లు ఎక్కువయ్యాయి. దొంగలకు, దోపిడీదార్లకు ఏ కోశానా భయం లేకుండా పోయింది. సందు చూసుకుని తమ పని కానిచ్చేస్తున్నారు. దీనికి కారణం పోలీసుల నిఘా నిస్తేజంగా వుండడమే!**

పోలీసుల రక్షణ చర్యలు అంతంత మాత్రంగానే వుంటున్నాయి. నిఘా వ్యవస్థను పటిష్టం చేయడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయలేని దుస్థితిలో నగరం ఉంది. రక్షణ వ్యవస్థ కనీసం ఆర్టీసీ బస్టాండ్లో జేబు దొంగలను కట్టడి చేసే పరిస్థితుల్లో కూడా లేదు. షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్లు, హోటల్స్, లాడ్జీల విషయంలో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

ఇక రైల్వేస్టేషన్‌లో పనిచేయని మెటల్ డిటెక్టర్లను మూలన పడేశారు. రైలు మార్గాల ద్వారా బంగారు, వెండి ఆభరణాలు, గంజాయి అక్రమ రవాణా యధేచ్ఛగా జరుగుతోంది. వీటిని అరికట్టడంలో రైల్వే భద్రతా సిబ్బంది విఫలమయ్యారన్న విమర్శలున్నాయి.

లాడ్జీలపై పోలీసుల నిఘా కొరవడింది. దీంతో అసాంఘిక శక్తులు తిష్టవేసి తమ కార్యకలాపాలను జరుపుకుంటున్నట్లు సమాచారం. వ్యభిచారం, పేకాట, బెట్టింగ్‌లు లాడ్జీల్లో జోరుగా సాగుతున్నాయి. నేరం చేసినవారు లాడ్జీల్లో తలదాచుకుంటుంటే పోలీసులు మాత్రం శివారు ప్రాంతాల్లో, నగరంలో తనిఖీలు చేపడుతున్నారు. అసాంఘిక శక్తులు టూరిస్టులమని, పరిశ్రమల్లో పనులకొచ్చామని లాడ్జీల్లో దిగి నేరాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి లాడ్జీలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం లేదు. లాడ్జీల్లో అద్దెకు దిగేవారి ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటర్‌కార్డు తదితరాల్లో ఏదో ఒక గుర్తింపు కార్డు చూపితేనే గదులు ఇవ్వాల్సి వున్నా, ఎక్కడా అమలు చేయడం లేదు. దీంతో లాడ్జీల్లో ఎవరు దిగుతున్నారు, ఎవరు వెళుతున్నారనే విషయం తెలియడం లేదు. గతంలో లాడ్జీల్లో ఎవరైనా వ్యక్తులు దిగితే వారి పూర్తి సమాచారం ఆయా ప్రాంత పోలీసుస్టేషన్లలో ప్రతిరోజూ లాడ్జి సిబ్బంది ఇచ్చేవారు. కాలక్రమేణా ఆ ప్రక్రియ ఆగిపోయింది. దీంతో నేరగాళ్ళు లాడ్జీల్లో మకాం వేసి దర్జాగా చోరీలు, దోపిడీలకు పాల్పడు తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం శివారు ప్రాంతాలవైపే కాకుండా ప్రతిరోజూ లాడ్జీలపై దృష్టి పెట్టాల్సిన అవసరముందని ప్రజలు కోరుతున్నారు.

సింహపురి సమాచారం

## 'అవినీతి'పై ఆకస్మిక దాడి!

ప్రభుత్వ శాఖల్లో జీతాల పరంగా కాకుండా లంచాల పరంగా ఎక్కువ ఆదాయం వచ్చే శాఖల్లో చెప్పుకోదగింది వాణిజ్య పన్నుల శాఖ. ఈ శాఖాధికారులు వసూలు చేసే పన్నుల మొత్తంకంటే మింగే లంచాల నగదే ఎక్కువగా ఉంటుందంటే ఆశ్చర్యం కాదేమో! ఏసిబి అధికారులు దాడి చేసినప్పుడు మాత్రమే ఒకటి అరా అవినీతి కథలు వెలుగులోకి వస్తుంటాయి. తాజాగా ఏసిబి దాడితో వెలుగులోకి వచ్చిన అవినీతి సొరచేప పేరే సూర్యప్రకాశ్. వాణిజ్య పన్నుల శాఖలో ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న సూర్యప్రకాశ్ ఇంటిపై ఇటీవలే ఏసిబి అధికారులు దాడులు నిర్వహించారు. దాదాపు 21గంటల పాటు ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో 10కోట్లకు పైగా విలువచేసే ఆస్తులను కనుగొన్నారు. నెల్లూరుతో పాటు గుంటూరు, మైసూరులో ఇళ్ళు, హైదరాబాద్, విజయవాడ, గుంటూరుల్లో స్థలాలు, పొలాలు ఉన్నట్లు గుర్తించారు. సూర్యప్రకాశ్ గతంలో నెల్లూరు, గూడూరులలో సిటిఓగా పనిచేసారు. రెండు చోట్లా బాగానే పిండేసాడని పేరుంది. ఏసిబి అధికారులు అరెస్ట్ చేసి కోర్టుకు పెట్టడం, న్యాయమూర్తి ఆయనను రిమాండ్‌కు ఆదేశించడం జరిగిపోయాయి.

## వెనామీకి వ్యాధులు

నెల్లూరు జిల్లాలో వేలాది హెక్టార్లలో వెనామీ రొయ్యలు సాగవుతున్నాయని, ప్రస్తుతం వెనామీ సాగు తెల్లపెంట, వైట్‌గట్ వ్యాధులతో సంక్షోభంలో వుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీసభ్యులు పెనుబల్లి హనుమంత రావునాయుడు తెలిపారు. ఆదివారం గంగపట్నం గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధులతో రొయ్యల చెరువుల్లో రొయ్యల సంఖ్య క్రమేపీ తగ్గిపోయి దిగుబడులు రాకపోవడమే కాకుండా, సాగుకాలం ఎక్కువ అయినందున కరెంటు ఛార్జీలు, ఇతర ఖర్చులు పెరిగిపోయి తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రస్తుతం జిల్లాలోని హేచరీల్లో దాదాపు వందశాతం రొయ్య పిల్లలు ఈ వ్యాధి బారిన పడినట్లు తెలుస్తోందన్నారు. ఈ వ్యాధి వైరస్‌లాగా ప్రాణాంతకం కాదు గాబట్టి సత్వర నివారణ చర్యలు అన్వేషించి రైతులకు తెలియజేస్తే రైతుకు కొంతమేర లాభం చేకూరే అవకాశం ఉందన్నారు.

## బదిలీల్లో కొందరికి అన్యాయం

జిల్లాలో జరిగిన పోలీసు సిబ్బంది బదిలీల్లో కొంతమందికి అన్యాయం జరిగిందని, ఈ విషయం పరిశీలించి న్యాయం చేయాలని పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు మద్దిపాటి ప్రసాదరావు జిల్లా ఎస్పీ డాక్టర్ గజరావు భూపాల్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆ సంఘం సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలను, వారు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్ళారు. పోలీసు సిబ్బందికి వారాంతపు సెలవులు మంజూరు చేయాలని, ఎస్కార్ట్ విధులకు వెళ్ళే సిబ్బందికి వాహన సౌకర్యం కల్పించాలని, ఎస్ఐ, సిఐలకు అందే రేషన్ కోసం పోలీసు క్లబ్‌ను పునరుద్ధరించాలని, ర్యాంక్ ప్రమోటీ ఎస్ఐలకు ప్రాధాన్యత వున్న పోస్టింగ్‌లు ఇవ్వాలని వారు జిల్లా ఎస్పీని కోరారు. 1995 బ్యాచ్‌కు చెందిన పీసీలకు గత పిఆర్‌సిలో అన్యాయం జరిగిందని వారు ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా, నెల్లూరు మూలాపేటలో వున్న పోలీస్‌క్వార్టర్స్‌లో నీటి సమస్య వుందని ఎస్పీకి విన్నవించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రెడ్డి గంగాధరరావు, సూరిబాబు, ఏఆర్ డిఎస్పీ చెంచురెడ్డి, జిల్లా పోలీస్ కార్యాలయం ఏ.ఓ రాజశేఖర్, డిపిఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిల్లకూరులో మద్యం దుకాణంపై యుద్ధం

చిల్లకూరులోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని స్థానికులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటుచేయడం వల్ల ప్రజలకు ఎంతో ఇబ్బందిగా వుందని వారు పేర్కొన్నారు. పలుసార్లు తమ ఆవేదనను అధికారులకు వివరించినప్పటికీ వారిలో ఎలాంటి స్పందన లేదని వారు ఆందోళనతో అన్నారు. ఇక్కడ మద్యం దుకాణం వెంటనే తొలగించాలని వారు ఉప తహశీల్దార్ రామమోహన్‌కు వారు వినతి పత్రం సమర్పించారు.

## రైతుల కోసమే 'మీ ఇంటికి-మీ భూమి'

### - జిల్లా కలెక్టర్ జానకి

రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం 'మీ ఇంటికి-మీ భూమి' అనే కార్యక్రమం ద్వారా రైతుల భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి నడుం బిగించింది. 1-బి రిజిస్టర్‌లో రైతులకు సంబంధించిన పూర్తి వివరాలు లేకుంటే ఈ కార్యక్ర మంలో రెవెన్యూ సిబ్బంది సంబంధిత రైతులకు అప్లికేషన్లు ఇచ్చి, అక్కడికక్కడే మార్పులు చేర్పులు చేసుకునేందుకు నిర్ణ యించారు. సోమవారం కోవూరు మండ లంలోని మోడేగుంట గ్రామంలో కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి ఈ కార్యక్రమంలో పాల్గొని 'మీ ఇంటికి-మీ భూమి' కార్యక్రమ లక్ష్యాలను రైతులకు వివరించారు. కొత్తగా పట్టా దార్ పాస్‌పుస్తకాలు కావాలన్నా, లేదా భూమి రికార్డుల్లో ఏదైనా మార్పు చేర్పులు చేసుకోవాలన్నా మీ-సేవ ద్వారా ధర ఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సెప్టెంబర్ 30వ తేదీలోగా ఈ సవరణలు పూర్తిచేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, నెలా ఖరుదాకా అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగు తుందని తెలిపారు. కోనేరు రంగారావు కమిటీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కృష్ణకిషోర్, తహశీల్దార్ నరసింహులు, ఎంపిపి ఉమ, ఉప సర్పంచ్ లీలావతి, విఆర్ఓ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్నెట్‌లో ఏఎస్‌పేట దర్గా చరిత్ర

నెల్లూరుజిల్లా ఏఎస్‌పేటలోని శ్రీ హజరత్ దర్గాను ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఉంచనున్నట్లు దర్గా అడ్మినిస్ట్రేటర్, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి భూపాల్‌రెడ్డి తెలి పారు. 8వ తేదీ ఏఎస్‌పేట దర్గాలో యాత్రికులకు అందుతున్న వసతులను ఆయన పరిశీలించారు. శ్రీ హజరత్, అమ్మాజీల సమాధులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 240సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ హజరత్, అమ్మాజీల చరిత్ర అందరికీ అందుబాటులో వుంచేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఆన్‌లైన్‌లో హజ్రత్ వారి పూర్తి సమాచారం ఉంచడం వల్ల దేశ, విదేశాల్లోని వారందరూ తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ట్రస్టీ సైపుర్ రహమాన్ ఖాద్రి, సజ్జాదానషీన్ హఫీజ్ పాషా, దర్గా ఇంజనీరు ఆరిఫ్‌హుస్సేన్ పాల్గొన్నారు.

## చెంగాళమ్మ హుండీ ఆదాయం 23.95లక్షలు

నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేటలో వెలసి యున్న చెంగాళమ్మ అమ్మవారికి హుండీ కానుకల ద్వారా రూ.23.95 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం హుండీ కానుకలు లెక్కిం చారు. మూడు నెలల కాలానికి అమ్మవారికి రూ.23,95,490 కానుకల రూపంలో వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## హైలెవల్ కెనాల్ ద్వారా 43వేల ఎకరాలకు నీళ్ళు

నెల్లూరుజిల్లా మర్రిపాడు మండలంలో సోమశిల హైలెవల్ కాలువ ద్వారా 43,200 ఎకరాలు సాగులోకి వస్తాయని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి తెలిపారు. మర్రిపాడు మండలంలోని పడమటినాయుడుపల్లి సమీపంలో జరుగుతున్న సోమశిల హైలెవల్ కాలువ నిర్మాణ క్యాంపు కార్యాలయంలో ఆయన అధికారులు, కాంట్రాక్టర్లు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన మర్రిపాడు మండలంలో తాగు, సాగు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. హైలెవల్ కాలువ ద్వారా మండలంలో బీడు భూములు సాగు భూములుగా మారుతాయన్నారు. 4700ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉన్నప్ప టికి ప్రస్తుతం 260ఎకరాలు మాత్రమే సేకరించారన్నారు. మిగిలిన భూములను కూడా సేకరించేందుకు పనులు వేగవంతం చేయాలన్నారు. ఇందుకోసం కలెక్టర్‌తో సమావేశం కానున్నట్లు తెలిపారు. కాలువ పనులు రెండేళ్లలో పూర్తయితే మండలంలో సాగు, తాగునీటి కొరత తీరుతుందన్నారు. మర్రిపాడు మండలాధ్యక్షుడు కటారి రమణయ్య, సర్పంచ్‌లు శ్రీనివాసులునాయుడు, సానా వేణుగోపాల్‌రెడ్డి, కటారి వెంకటేశ్వర్లు, వైయస్సా ర్సీపీ మండల అధ్యక్షుడు గంగవరపు శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చింతలదేవిపై శ్రద్ధ చూపండి


### --- పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ---

కొండాపురం మండలంలోని చింతలదేవిలో నిర్మిస్తున్న కామధేను ప్రాజెక్ట్ నిర్మాణా లపై అధికారులు తగు శ్రద్ధ తీసుకోవాలని, అక్కడ ఆ ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన అన్ని వసతులు వున్నాయని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ మన్మోహన్ సింగ్ అన్నారు. కలెక్టరేట్ ఛాంబర్‌లో సోమవారం నిర్వహించిన డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు 2 వేల ఎకరాల్లో ఈ ప్రాజెక్ట్ నిర్మాణాలు జరుగుతున్నాయని, ఈ ప్రాజెక్టుకు సంబంధించి గత నెల 13న కమిటీ సమావేశం కూడా జరిగిందని, ఈ ప్రాజెక్ట్ దాదాపు 2 వేల ఎకరాల్లో నిర్మాణం జరుగుతుందని తెలిపారు. పశువులకు మంచినీరు కొరత లేకుండా అందించాలని, అదేవిధంగా అటవీప్రాంతంలో పశుగ్రాసం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఇర్వై నాలుగు గంటలూ విద్యుత్ అందుబాటులో వుండేలా చూడాలని, అందుకు ప్రాజెక్ట్‌లో సబ్‌స్టేషన్ నిర్మాణానికి కృషి చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ జేడీ జెఎస్ఎం శ్రీధర్‌కుమార్, కావలి ఆర్డీఓ నరసింహన్, హౌసింగ్ పీడీ రామచంద్రారెడ్డి తదితరులు పల్గొన్నారు.

# సీఎం తంటాలు పడుతూనే వున్నారు

**- మున్సిపల్ మంత్రి**



రాష్ట్రానికి ప్రత్యేకహోదా తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాగానే తంటాలు పడుతున్నారని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు. 10వ తేదీ నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంతో తగాదా పెట్టుకుంటే ప్రత్యేకహోదా రాదని, కేంద్రం దృష్టికి రాష్ట్ర పరిస్థితులను, సమస్యలను తీసుకెళ్లి ప్రత్యేక హోదా సాధించేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని అన్నారు. జిల్లాలో ప్రస్తుతం 8.4లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతోంది. రానున్న రోజుల్లో ఏడాదికి లక్ష ఎకరాల చొప్పున నాలుగేళ్లలో నాలుగులక్షల ఎకరాలకు అదనంగా నీరందించాలనేదే తమ లక్ష్యమన్నారు. రైతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకే 'మీ ఇంటికి మీ భూమి' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. భూముల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంచుతామని, దీనివల్ల బోగస్‌పాస్‌బుక్‌లను ఎత్తేయవచ్చన్నారు. 2015-16 సంవత్సరానికి సంబంధించి 322మంది బీసీలకు, 5611మంది ఎస్టీలకు, 1864మంది ఎస్సీలకు సబ్సిడీ ఋణాలు అందజేస్తున్నామని చెప్పారు. లబ్దిదారుల ఎంపికను ఏడుమంది సభ్యులతో కూడిన కమిటీ చేస్తుందని చెప్పారు.

# పోలీసు డాక్టర్



జిల్లా ఎస్పీ గజరావు భూపాల్‌లో అంత ర్లీనంగా దాగున్న డాక్టర్ బయటకొచ్చాడు. పోలీసు వృత్తిలో కాదు, వైద్యవృత్తిలోనూ నిష్ణాతుడినని నిరూపించుకున్నాడు. ఈ నెల 12వ తేదీన ఆయన పోలీసు ఉద్యోగాన్ని పక్కనపెట్టి డాక్టర్‌గా ఒక ప్రాణాన్ని కాపాడిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్పీ ఆరోజు బిట్రగుంట పోలీసుస్టేషన్‌ను పరిశీలించి నెల్లూరుకు బయలుదేరారు. ఉలవపాళ్ల వద్ద జాతీయ రహదారిపై ఓ యువకుడు పడిపోయి ఉండడాన్ని ఎస్పీ గుర్తించారు. వెంటనే కారాపి క్రిందకు దిగి ఆ యువకుడి వద్దకు వెళ్లాడు. ఆ యువకుడి నాడి పరిశీలించాడు. మూర్చవ్యాధితో పడిపోయినట్లు గుర్తించి వెంటనే ఆ యువకుడికి తాత్కాలిక ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కావలి ఆసుపత్రికి పంపించారు. గజరావు భూపాల్ పోలీసు శాఖలో చేరకముందు వైద్యుడు. ఆయన డాక్టర్ అయ్యుండడం ప్రజలకు ఈ విధంగా కూడా ఉపయోగపడుతోంది.

# ముని కోటిని చంపేసారు

**- వివేకా ఆవేదన**




ప్రత్యేకహోదా కోసం కాంగ్రెస్ పార్టీ తిరుపతిలో నిర్వహించిన ధర్నాలో ఆత్మాహుతికి పాల్పడ్డ మునికోటికి నెల్లూరు ఏసి సెంటర్‌లో ఈ నెల 10వ తేదీన కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీసీసీ ఉపాధ్యక్షులు ఆనం వివేకానందరెడ్డి మాట్లాడుతూ మునికోటిది ఆత్మహత్య కాదని, ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులే అతని మరణానికి కారణమని ఆవేశంగా ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఈ ఇద్దరూ నిలువునా నమ్మించి ముంచారు, వీళ్ల జీవానికి అమాయక ప్రజలు చనిపో తున్నారన్నారు. కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి పదేళ్ల ప్రత్యేకహోదా నిస్తామని తిరుమల వెంకన్న సాక్షిగా నరేంద్ర మోడీ చెప్పాడని, ఇప్పుడు ప్రణాళికా సంఘం పేరుతో ప్రత్యేకహోదానివ్వకుండా నాటకాలాడుతున్నారని విమర్శించారు. బీజేపీ, టీడీపీలకు ఓట్లేసినందుకు ప్రజలు సిగ్గుతో తలదించుకుంటున్నారన్నారు. రాష్ట్రం కరువు కాటకాలతో అల్లాడుతుంటే చంద్రబాబు మాత్రం జపాన్, టర్కీ, మలేషియాలకు తిరుగుతూ జల్సాలు చేస్తున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, బర్నాబాసు, షఫి తదితరులు పాల్గొన్నారు.

# అ'సామాన్య' ఎమ్మెల్యే



## ప్రభుత్వం చేసిన సర్వేలోనే మొదటి స్థానంలో నిలిచిన వైకాపా ఎమ్మెల్యే కోటంరెడ్డి

*తాను ప్రతిపక్ష ఎమ్మెల్యే... ప్రభుత్వం నుండి సహకారం లేదు.. ఎమ్మెల్యే గ్రాంట్ లేదు... రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతకన్నా బాగాలేదు... ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా తన సత్తాను చూపిస్తూ... పనితీరును పెంచుకుంటూ నిరంతరం ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన సర్వేలోనే పనిలో ఫస్ట్, ప్రజలకు చేరువ కావడంలో బెస్ట్ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందడం అతని చిత్తశుద్ధికి నిదర్శనం.*

రాజకీయాలలో వుండే వాళ్లకు ఎమ్మెల్యే కావాలనేది ఒక కల. ఎమ్మెల్యే కావడం ఒకెత్తయితే, ఆ పదవిలో పనిచేసి రాణించడం మరో ఎత్తు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఏర్పడిన తర్వాత ఇంత వరకు ఎన్నో అసెంబ్లీలు వచ్చాయి, పోయాయి. వేల సంఖ్యలో నాయకులు ఎమ్మెల్యేలయ్యారు. వీరిలో పనిచేసి పేరు తెచ్చుకున్నోళ్లున్నారు, ఏ పనీ చేయలేక అసమర్థులుగా ముద్రపడిన వాళ్లున్నారు. అయితే గత అసెంబ్లీ వరకు ఏ ఎమ్మెల్యే కూడా ఎందుకు ఎమ్మెల్యే అయ్యామురా బాబు అని బాధపడే పరిస్థితి రాలేదు.

అయితే రాష్ట్ర చరిత్రలో మొదటిసారి ఆ పరిస్థితి వచ్చింది. విభజన తర్వాత ఏర్పడిన అసెంబ్లీలో 175మంది ఎమ్మెల్యేలున్నారు. వీరిలో చాలామంది కొత్తవాళ్లే! ఎమ్మెల్యేలమై ఏదో చేసేద్దామని వచ్చిన వాళ్లే. కాని ఇప్పుడేమీ చేయలేక చేష్టలుడిగి చూస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంత ఘోరంగా వుంది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకే కాదు, అధికారపక్ష ఎమ్మెల్యేలకు కూడా చేయాల్సిన పనులు చాలానే వున్నా అవి చేయడానికి నిధులు లేవు. రాష్ట్ర ప్రభుత్వానికి సింగపూర్ రాజధాని, గోదావరి పుష్కరాలు, పట్టిసీమ, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా వంటివి తప్పితే ఇంకేమీ పట్టడం లేదు. ప్రతి నియోజకవర్గంలోనూ సమస్యలు అలాగే వున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎమ్మెల్యేలకు గ్రాంట్ ఇవ్వడం లేదు. అధికారపార్టీ ఎమ్మెల్యేలు అధికారుల బదిలీలు, ఇసుక కాంట్రాక్ట్‌లు వంటి పనులను పెట్టుకున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు గోళ్ళు గిల్లుకుంటూ కూర్చో వాల్సిందే! రాష్ట్రంలో పరిస్థితులు అంత దారుణంగా ఉన్నాయి.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ఇంతటి వ్యతిరేక పరిస్థితులున్న వాతావరణంలో కూడా పనితీరు పరంగా నెల్లూరుజిల్లాలో ఒక ప్రతిపక్ష ఎమ్మెల్యేనే మొదటి స్థానంలో నిలవడం అధికారపార్టీ మంత్రికి, ఎమ్మెల్యేలకు అవమానం. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎమ్మెల్యేల పనితీరుపై రహస్య సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మొదటి స్థానంలో నిలిచాడని తేలింది. జిల్లాలోని మిగతా వైకాపా ఎమ్మెల్యేలు కూడా ప్రజల్లో తిరుగుతూనే వున్నారు. సమస్యలు తెలుసుకుంటున్నారు. సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తున్నారు.

గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుండి తన సొంత పంథాలో నడుస్తున్నారు. అపాయింట్‌మెంట్లు, వెయిటింగ్‌లు లేకుండా ఎవ్వరైనా సరే నేరుగా తనను కలిసే ఒక మంచి పద్ధతికి శ్రీకారం చుట్టాడాయన. ప్రభుత్వం నుండి నిధులొస్తాయి, ఆ నిధులతోనే పనులు చేయాలని మడి కట్టుకు కూర్చోలేదు. మొదట ప్రజలకు అందుబాటులో ఉంటున్నాడు. ఉదయం 8గంటల కల్లా తన కార్యాలయంలో ప్రత్యక్షమవడం, ఎవరొచ్చి సమస్య చెప్పినా విని స్పందించడం ఆయన పనితీరుకు కొలమానంగా నిలిచాయి. 5ఏళ్ల పాటు తనకొచ్చే 60లక్షల జీతాన్ని తన నియోజకవర్గంలో విద్య, వైద్యం, మంచినీటి పనులకు కేటాయించి ఇంతవరకు జిల్లాలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా చేసి ఆదర్శంగా నిలిచాడు. ఎమ్మెల్యేగా తొలి అడుగులు వేసే టప్పుడే ఆయన ఈ పని చేయడంతో ప్రజలంతా మెచ్చుకున్నారు. ముఖ్యంగా పేద, మైనార్టీ, దళిత వర్గాలు నివసించే కాలనీలపై దృష్టి పెట్టారు. తన స్నేహితులు, దాతల సహకారంతో పలు కాలనీలలో వాటర్‌ప్లాంట్‌లను ఏర్పాటు చేయించి మినరల్ వాటర్ అందించడం, తన నియోజకవర్గంలో వికలాంగుల డేటా అంతా సేకరించి వారిళ్లకే స్వయంగా వెళ్లి మూడుచక్రాల సైకిళ్లను అందించడం, పదో తరగతిలో ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించడం, నగర శివార్లలో కాలుష్యం బారిన పడుతున్న కాలనీలను గుర్తించి, వాటికి పరిష్కారం సాధించడం, గ్రామాలలో శ్మశాన సమస్యలపై దృష్టి పెట్టడం, ఉన్నతాధికారులతోనూ, నగర పాలకవర్గం తోనూ సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ తన నియోజకవర్గ పరిధిలో సమస్యలను పరిష్కరించుకుంటుండడం... ఇలా కోటంరెడ్డి చేస్తున్న ఎన్నో పనులు ఆయనను ఒక మంచి ఎమ్మెల్యేగా మలుస్తున్నాయి. సమస్యలు పరిష్కరించాలంటే డబ్బే కాదు, మనసుంటే చాలా మార్గాలుంటాయని చాటిన కోటంరెడ్డికి అభినందనలు.

# గాయపడ్డ బీద

**-- ఒకటిన్నర నెల రెస్ట్ --**



తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర కాలికి గాయమైంది. ఈ నెల 7వ తేదీన మంత్రి పి.నారాయణతో కలిసి నెల్లూరు బ్యారేజిని పరిశీలించి వస్తుండగా కాలు జారి మెలిపడింది. దీంతో వెంటనే సింహపురి ఆసుపత్రికి తరలించారు. కాలు ఎముక ఫ్రాక్చర్ అవడంతో వైద్యులు పిండికట్టు కట్టి ఆరు వారాల పాటు ఎక్కడికీ కదలకుండా ఇంట్లోనే పడుకోమన్నారు. అందుకు అనువైన బెడ్‌ను కూడా అమర్చారు. ఏడాది కాలంగా బిజీతో రవిచంద్రను పట్టుకోవడమే చాలా కష్టంగా వుండేది. ఇప్పటిదాకా ఆయన దొరకని వాళ్లు ఇప్పుడు ఎంచక్కా ఆయన ఇంటికెళ్లి పరామర్శించొచ్చు. పనిలో పనిగా తమ పని కూడా చెప్పుకోవచ్చు.


# విద్యార్థులు మానసికంగా ఎదగాలి




విద్యార్థులు చదువుతో పాటు శారీరకంగా, మానసికంగా ఎదిగినప్పుడే ఎలాంటి సమస్యలైనా ఎదుర్కో గలరని ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరు టౌన్‌హాలులో తెలుగునాడు విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షుడు కాకర్ల తిరుమల నాయుడు ఆధ్వర్యంలో ర్యాగింగ్ వ్యతిరేక సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సోమిరెడ్డి మాట్లాడుతూ టెర్రరిస్టు కాల్పులను ఎదుర్కొని ధైర్యంగా నిలిచిన మలాలాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ర్యాగింగ్‌ను ఎదుర్కోవాలేగాని ప్రాణత్యాగాలకు పాల్పడకూడదన్నారు. ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా 1997లో అప్పటి సిఎం చంద్రబాబు చట్టం తీసుకువచ్చారన్నారు. జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ మాట్లాడుతూ ర్యాగింగ్‌పై సభ నిర్వహించాల్సి రావడం దురదృష్టకరమన్నారు. అవివేకం, అవగాహన లేమి, మూర్ఖత్వం లాంటివే ర్యాగింగ్‌కు కారణమన్నారు. అనంతరం రిషితేశ్వరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి జిల్లా కార్యదర్శి, జడ్పీటీసీ చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్, వివిఎస్‌యూ కళాశాల ప్రిన్సిపల్ మురగయ్య, విశ్వసాయి కళాశాల కరస్పాండెంటు సత్యనారాయణ, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# 'ప్రత్యేక' ఆచరణ అవశ్యం!



**విభజనతో తీవ్ర అన్యాయానికి, గుండె కోతకు గురైన ఒక రాష్ట్రాన్ని ఆదుకునేందుకు, కేంద్రం ఇంకా మీనమేషాలు లెక్కిస్తుండడం, 15 నెలలు గడిచినా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం బాధాకరం. అన్యాయానికి గురైన ఒక రాష్ట్రాన్ని ఆదుకునేందుకు తక్షణం కదలాలే కానీ.. ఇలా నెలల తరబడి కాలయాపన చేస్తుండడం సముచితం కాదు. ఎలాంటి అడ్డంకులు, నియమనిబంధనలు ఎదురొచ్చినా, రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతారని ప్రధాని మోడీపైనే ప్రజలు ఆశలు పెట్టుకునివున్నారు. ఇకనైనా కేంద్రం వెంటనే స్పందించాలి.**

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలనే డిమాండ్‌తో రాష్ట్రం అట్టుడికిపోతోంది. చెప్పిన మాట నిలబెట్టుకోకుండా కాలయాపన చేస్తున్న నేతల తీరుపై ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇదే సందర్భంలో ప్రతిపక్షాలు, విపక్షాలూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాట పట్టాయి. విభజనతో సమస్యల సుడిగుండంలో పడిపోయిన రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రం వెంటనే సమాయత్తం కావాలని, రాష్ట్రానికి ఇస్తామన్న ప్రత్యేక హోదా ఇవ్వాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని చెప్తున్న కేంద్రం ఆ దిశలో తీసుకున్న చర్యలు ఏమాత్రం సంతృప్తికరంగా లేవని, గత పదిహేను నెలలుగా అదిగో.. ఇదిగో అంటూ ఊరిస్తూనే వున్నారు తప్ప, ప్రత్యేక హోదా అన్నది గగన కుసుమంగానే మారిందని ప్రజలు, నాయకులు అందరూ నిరాశలో పడిపోతున్నారు. ప్రత్యేక హోదా వస్తే రాష్ట్రాభివృద్ధికి కావాల్సిన సాయం అందుతుందని, ప్రత్యేక రాయితీలు అందివస్తాయని, తద్వారా రాష్ట్రం పురోగమిస్తుందనీ అందరి ఆశ. కానీ, రోజులు నెలలు గడిచిపోతున్నా కేంద్రం ఆశించిన స్థాయిలో పట్టించుకోకపోవడం విచారకరం. రాష్ట్రం ఒకవైపు ఆర్థికంగా అనేకరకాల ఇబ్బందుల్లో సతమత మవుతూనే వుంది. రాజధాని కూడా లేని నవ్యాంధ్రకు రాజధాని నిర్మాణం మరో బృహత్తర కార్యక్రమంగా వుంది. మరోవైపు రాష్ట్రానికి లోటు బడ్జెట్ భారీగానే వుంది. విభజనతో వచ్చిన కష్టాలనూ కన్నీళ్ళనూ దిగమింగుకుని, ఎలాగైనాసరే రాష్ట్రాన్ని తిరిగి ప్రగతిబాట పట్టించాలని, అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా వుండాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఆ దిశలో కేంద్రం, ముఖ్యంగా ప్రధాని నరేంద్రమోడీ ఆలోచిస్తారని, రాష్ట్ర పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తప్పకుండా రాష్ట్రాభివృద్ధికి అన్నివిధాల సాయం చేస్తారని ఆశించిన ప్రజలకు ఈ కాలయాపన తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. నెలలు గడిచిపోతున్నా ప్రత్యేక హోదా కానీ, ఆశించిన సాయం కానీ అందక రాష్ట్రం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడనే అన్నట్లుగా వుంది. ఆర్థికంగా రాష్ట్రం ఎదుగదలకు ప్రత్యేక సాయం అందించడంలో కేంద్రం ఇంకా మీనమేషాలు లెక్కిస్తూండడం బాధాకరం. గతంలో పాలకులు చిత్తం వచ్చిన రీతిలో రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించి తీరని అన్యాయం చేశారు. విభజన గుండెకోతతో, అప్పుల మోతతో..దాదాపు 15వేల కోట్ల లోటు బడ్జెట్‌తో రాష్ట్రం 'నవ్యాంధ్ర'గా, ఒక బేలగా నిలచింది. అలాంటి కష్టదశలో బిజెపిపై, చెప్పిన మాట ఖచ్చితంగా నిలబెట్టుకునే మహోన్నత నేత నరేంద్రమోడీపై నవ్యాంధ్ర ప్రజలు బోలెడన్ని ఆశలు పెట్టుకున్నారు. ఒక చేత్తో కన్నీళ్ళు తుడుచుకుంటూ, మరో చేత్తో టిడిపికి, బిజెపికి ఓట్లు వేసి గెలిపించారు. విభజనతో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసి, వేదననే మిగిల్చిన కాంగ్రెస్‌ను ప్రజలు పూర్తిస్థాయిలో తిరస్కరించారు. దేశవ్యాప్తంగా కూడా ప్రజలు బిజెపికి పట్టం గట్టారు. దేశప్రధానిగా నరేంద్రమోడీ పదవిని అధిష్టించడం, ఇటు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం, బిజెపిలో అత్యంత ముఖ్యమైన నేతగా వున్న వెంకయ్యనాయుడు కేంద్రమంత్రి కావడంతో రాష్ట్ర ప్రజలు మరెంతో సంతోషించారు. ఇక నవ్యాంధ్రకు దిగులే లేదని, త్వరలోనే కష్టాల నుంచి కోలుకుంటుందని ప్రజలంతా కోటి ఆశలతో ఇంతకాలంగా ఎదురుచూస్తూనే వున్నారు. కానీ, 15 నెలలు గడిచినా ఆ ఆశలు నెరవేరకపోవడం బాధాకరం. 15వేల కోట్ల లోటుబడ్జెట్‌లో కేవలం 5వందల కోట్లనే కేంద్రం సాయంగా ప్రకటించడం, ప్రత్యేక హోదా మాటే అనుకోకపోవడంతో ప్రజలు మరింతగా ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ఉద్యమిస్తూ ప్రతిపక్ష, వామపక్ష పార్టీలన్నీ కలసి రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 11న పెద్దఎత్తున ఆందోళనకు, బంద్‌లకు ఉపక్రమించాయి కూడా. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని, ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చిన బిజెపి, తీరా పదవిలోకి వచ్చాక కాలయాపన చేస్తుండడం ఎంతైనా విచారకరం. విభజనతో తీవ్ర అన్యాయానికి గురైన రాష్ట్రాన్ని ఆదుకునేందుకు, కాలయాపన ఎందుకో ఎవరికీ అర్థం కావడం లేదు. ఎలాంటి అడ్డంకులు, నియమ నిబంధనలు ఎదురొచ్చినా, రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని చక్కదిద్దేందుకు ప్రధాని మోడీ మరింత వేగవంతమైన నిర్ణయాలు తీసుకుంటారని అందరూ ఆశిస్తున్నారు. ప్రధాని తలచుకుంటే ఇదేమీ పెద్ద సమస్య కాదు. అందులోనూ రాష్ట్రానికంతటికీ సంబంధించిన ఎంతో ముఖ్యమైన అంశం ఇది. ఇలాంటి విషయాల్లో అసలు కాలయాపన మంచిది కాదు. అయినా, అప్పటి పాలకులు అడ్డగోలుగా చేసిన విభజనకు లేని అడ్డంకులు..ఇప్పుడెందుకు?..రాష్ట్రాన్ని ఆదుకునేందుకు ఎలాంటి అవరోధాలనైనా అధిగమించాల్సిన తరుణం ఇదే. ముఖ్యంగా ప్రధాని నరేంద్రమోడీ చొరవ తీసుకుని నవ్యాంధ్రకు న్యాయం చేయాలి. అందులోనూ రాష్ట్ర ప్రజల ఆశలన్నీ ఆయనపైనే వున్నాయి. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన ఏ విషయంలోనూ ప్రధాని మోడీ ఇప్పటిదాకా కాదన్నది కానీ, లేదన్నది కానీ లేదు. అందుకే, రాష్ట్రానికి ఆయన అన్నివిధాలా న్యాయం చేస్తారని ప్రజలంతా ఆశిస్తున్నారు. బహుశా, ప్రత్యేక హోదా కంటే మిన్నగానే రాష్ట్రానికి సాయం అందించాలనే ఆలోచన కూడా ఆయనలో వుండవచ్చు. ఏదేమైనా, కాలయాపన జరిగేకొద్దీ లేనిపోని నిరాశలు ఎదురవుతుంటాయి. ఆ చేసే సాయమేదో త్వరగానే చేయాలన్నదే ప్రజలందరి ఆకాంక్ష. ఇకనైనా 'ప్రత్యేక' ఆచరణ అవశ్యం. ప్రధాని మోడీ మాట తప్పని మహానేత..ప్రజలకు ఆయన పట్ల తిరుగులేని విశ్వాసం వుంది. ప్రధాని ఆశీస్సులతో రాష్ట్రానికి ప్రత్యేకహోదాతో పాటు, నవ్యాంధ్ర ప్రగతికి కేంద్రం నుంచి అన్నివిధాలా భారీ సాయం అందుతుందని ప్రజలంతా ఆశిస్తున్నారు. ఆ ఆశలు ఫలించాలి. ఆ మంచిరోజు నేడో.. రేపో.. త్వరలోనే.. వస్తుందని ఆశిద్దాం!.. ఆకాంక్షిద్దాం!!..

# శాకాంబరి అలంకారంలో శ్రీ చాముండేశ్వరీదేవి



నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో వెలసియున్న శ్రీ చాముండేశ్వరి దేవి అమ్మవారికి ఆదివారం కనులపండువగా శాకాంబరి అలంకారాన్ని నిర్వహించారు. దాదాపు లక్ష రూపాయలుపైగా విలువైన కూరగాయలు, పండ్లతో అమ్మవారిని, ఆలయాన్ని అలంకరించారు. కూరగాయలు, పండ్లతో తయారు చేసిన సాయిబాబా ప్రతిమ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. జిల్లా నలుమూలల నుంచి విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని శాకాంబరి మాత అలంకారంలో దర్శించుకుని తన్మయత్వం చెందారు. ఉభయకర్తలుగా నెల్లూరుకు చెందిన కొలపర్తి రమేష్‌కుమార్, సువర్ణలత దంపతులు వ్యవహరించారు. ఆలయ ఛైర్మెన్ పెనుబల్లి రామచంద్రయ్య నాయుడు, ఆలయ కార్యనిర్వహణాధికారి జానకీదేవి, సభ్యులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అర్చకులు పొత్తూరు సుధీర్‌శర్మ, మాచవోలు రామకృష్ణ, నూతలపాటి అనిల్‌కుమార్‌లు పూజాది కార్యక్రమాలను నిర్వహించారు.

### అంగన్‌వాడీ ఇంటర్వ్యూ

# తేదీలు మారాయి

జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకురాళ్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ తేదీలు మారాయి. మారిన తేదీల ప్రకారం ఈ నెల 17వ తేదీ నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో, 18వ తేదీ గూడూరు ఆర్డీఓ కార్యాలయంలో, 19వ తేదీ నాయుడుపేట ఆర్డీఓ కార్యాలయంలో, 20వ తేదీ కావలి ఆర్డీఓ కార్యాలయంలో, 21వ తేదీ కావలి ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయి. కొత్తగా నిర్ణయించిన తేదీలను గమనించి అభ్యర్థులు ఆయా ఆర్డీఓ కార్యాలయాలలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో కోరారు.

# కలాంకు కలంతో నివాళి



పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నెల్లూరు శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలోని జెవివి కార్యాలయంలో అబ్దుల్ కలాంకు కలంతో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పెరసం కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవి మాట్లాడుతూ కలాం లక్ష్మీపుత్రుడు కాకపోయినా ప్రజల అభిమానమే ఆయన సంపద అని కొనియాడారు. ఆయన భారతజాతి రత్నమని, మహోన్నత శాస్త్రవేత్త అనీ ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో అవ్వారు శ్రీధర్‌బాబు, మోపూరు పెంచలనరశింహం, గుండాల నరేంద్రబాబు, హరిత, ఇంద్రగంటి, అల్లాడి వేణుగోపాల్, దువ్వూరు సుమలత, సిహెచ్ ఉమాదేవి, గజల్ నాగరాజు, పి.విజయలక్ష్మి తదితరులు పాల్గొని తమ కవితలను వినిపించారు.

## టీ దాసులు

నేడు 'టీ' అష్టమ వ్యసనమైంది. గుక్కెడు టీ నోట్లో పడందే ఏ పనీ మొదలెట్టలేని దౌర్బల్యం! మనిషిని నడిపించే సర్వోన్నతమైన శక్తి కలిగింది టీ అని కొంతమంది భావన! అంత శక్తివంత మైంది అయితే, జాతిపిత మనకు 1947కన్నా ముందే స్వాతంత్ర్యం తెచ్చి వుండేవాడు సర్వోన్నత శక్తివంతమైన టీ సేవించి! ఛాయ్‌వాలా మోడీ ప్రధానమంత్రి అయింది అందుకేనేమో!

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## 'మనీస్కీం' కేసు పరిష్కరించండి

మనీస్కీం కేసును త్వరగా పరిష్కరించమని ఇటీవల కొందరు బీజేపీ నాయకులు పోలీసు ఉన్నతాధికారులను కోరడం హర్షించదగ్గ విషయం. జిల్లాలో వేలమంది అమాయకులు వందల కోట్ల రూపాయలు నష్టపోయారు. మనీస్కీం నిర్వాహకులు, వారి ఏజంట్ల ఆస్తులు పూర్తి స్థాయిలో జప్తుకాలేదు. మతవిశ్వాసాలను అడ్డం పెట్టుకుని చాలామంది ఏజంట్లు అమాయకులను మోసం చేశారు. ఈ కేసును విచారిస్తున్న పోలీసులు నిర్వాహకులు, ఏజంట్ల ఆస్తులను పూర్తిగా జప్తు చేయాలి.

**ఆలూరు ఆత్మానందం, నెల్లూరు.**




## అక్రమ డిప్యుటేషన్ రద్దు చేయాలి

నెల్లూరుజిల్లా న్యాయశాఖలో కాంట్రాక్ట్ సిబ్బందికి ఎక్కువ సంవత్సరాలు అక్రమంగా డిప్యుటేషన్ వేయడం సమంజసం కాదు. నెల్లూరు న్యాయశాఖలో పనిచేస్తున్న ఫాస్ట్ ట్రాక్, స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు సిబ్బందికి జీతాలు పెంచాలి. స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు సిబ్బందికి డిప్యుటేషన్‌లు వేయవద్దు. జిల్లా న్యాయమూర్తులు ఈ విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

**ఆర్. రఘురామ్, వెంకటగిరి.**

## బీజేపీని లెక్కచేయని తెలుగుదేశం

కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ, తెలుగుదేశంపార్టీలు కలిసి నడుస్తున్నాయి. అయితే రాష్ట్రంలో తెలుగుదేశం నాయకులు బీజేపీతో అంటీ అంటనట్లున్నారు. బీజేపీ మంత్రులను చంద్రబాబు లెక్కలోకి తీసుకోవడం లేదు. వెంకయ్యనాయుడు రాష్ట్రానికి వచ్చినప్పుడే వాళ్లకు బీజేపీ గుర్తుకువస్తుంది. బీజేపీని కలుపుకుని పోతేనే తెలుగుదేశంకు మనుగడ. లేకుంటే శంకరగిరిమాన్యాలు పట్టాల్సిందే! గత ఎన్నికల్లో నరేంద్ర మోడీ ఇమేజ్ తెలుగుదేశం పార్టీకి ఉపయోగపడింది. 1999లో వాజ్‌పేయి పుణ్యాన గెలిచాడు. అది మరచిపోవద్దు.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# నెల్లూరు కబుర్లు

## నెల్లూరుకు మంత్రుల దండు

నెల్లూరులో ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర వైభవోత్సవాల పుణ్యమా అని పలువురు రాష్ట్ర మంత్రులు ఇక్కడకు రావడం జరిగింది. గత వారం రోజుల్లో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి పి.మాణిక్యాలరావు, మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, వైద్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, ఐ.టి శాఖ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలు నెల్లూరొచ్చి వెంకటేశ్వర వైభోత్సవాలతో పాటు అధికారిక కార్యక్రమాలలో కూడా పాల్గొన్నారు. ఇంకా పలువురు మంత్రులు రానున్నారు.

## టీటీడీ కళ్యాణ మండపంలో దేవాలయాల మంత్రి



రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి పి.మాణిక్యాలరావు ఈ నెల 8వ తేదీన ఏ.సి స్టేడియంలో జరుగుతున్న శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవంలో పాల్గొనడానికి నెల్లూరొచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ కళ్యాణ మండపాన్ని సందర్శించారు. మండపంలో జరుగుతున్న మరమ్మత్తులను పరిశీలించారు. ఇక్కడ స్థలం బాగా ఉంది కాబట్టి కళ్యాణ మండపాన్ని ఇంకా అభివృద్ధి చేయవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. భక్తుల కోరిక మేరకు టీటీడీ కళ్యాణ మండపం ప్రాంగణంలో శ్రీవారి ఆలయం నిర్మిస్తామని చెప్పారు.

## డ్రైనేజీకి శంకుస్థాపన

నెల్లూరు, అరవిందనగర్ ఎక్స్‌టెన్షన్‌లో 8.20లక్షలతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణానికి ఈ నెల 10వ తేదీన మేయర్ అబ్దుల్ అజీజ్, గ్రామీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తెదేపా నెల్లూరు పార్లమెంటు ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డిలు శంకుస్థాపన చేసారు. 20వ డివిజన్ కార్పొరేటర్ దాసరి రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు టి.అనూరాధ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు నూనె మల్లిఖార్జున యాదవ్, బొబ్బల శ్రీనివాసయాదవ్, మన్నెం పెంచలయ్య, మల్లిబోయిన వెంకయ్యయాదవ్, డి.రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.



## పేద మహిళలకు కుట్టుమిషన్లు

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సంస్థ 7వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీన నిరుపేదలైన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కె.వి.శేషయ్య ఆచారి, ప్రధానకార్యదర్శి ఎల్.రాజేంద్ర ప్రసాద్ ఆచారి, గౌరవాధ్యక్షులు కె.మోహన్ ఆచారి, నగర ప్రముఖులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.






## నగర అదనపు కమిషనర్‌గా 'చల్లా'

నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా వున్న పి.చంద్రమౌళేశ్వర్‌రెడ్డి కడప నగర పాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ కానున్నారని ఆయన స్థానంలో కడప కమిషనర్‌గా ఉన్న చల్లా ఓబులేసు నెల్లూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా రానున్నట్లు తెలిసింది. అనంతపురం జిల్లాకు చెందిన ఓబులేసు నెల్లూరు వచ్చేందుకు కృషి చేస్తున్నారు.

## సమస్యల పరిష్కారానికి 'హెల్ప్‌డెస్క్'

ఏపి షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు ఆర్డీఓ కార్యాలయం ప్రాంగణంలో 'హెల్ప్‌డెస్క్' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపి షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ బాధితుల ఫిర్యాదులు వేలాదిగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఏళ్ళ తరబడి అపరిష్కృతంగా పేరుకు పోతున్నాయని, నిర్ణీతకాలంలో సమస్యను పరిష్కరించాలని, నిర్దేశిస్తున్న సిటిజన్ చార్టర్ అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు జి.ఆర్.విక్రమ్, వి.సునీల్, ఎం.హరనాథ్, నాగిశెట్టి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా మందిరంలో అన్నదానం

గురుపూర్ణిమ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 9న నెల్లూరు ట్రంకు రోడ్డులో వున్న షిర్డీ సాయిబాబా మందిరంలో సాయినాథునికి విశేష అలంకారాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేసి, అన్నదానం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. మందిరం కమిటీ అధ్యక్షులు మన్నెం అమరనాధరెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

## చిన్ని "గుండె దీపం"కు అద్దేపల్లి అవార్డు



ప్రముఖ కవి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు చిన్ని నారాయణరావుకు ప్రతిష్ఠాత్మక అద్దేపల్లి ఫౌండేషన్ వారి అవార్డు లభించింది. ఫౌండేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉత్తమ కవితా సంపుటి పోటీల్లో చిన్ని నారాయణరావు "గుండె దీపం" కవితా సంపుటికి తృతీయ బహుమతి లభించింది. ఈ అవార్డును ఈ నెల 9వ తేదీ ఆదివారం కాకినాడలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రముఖ ప్రజాకవి అద్దేపల్లి రామ్మోహన్‌రావు చేతులమీదుగా అనేకమంది కవులు, రచయితలు పాల్గొన్న సభలో చిన్ని నారాయణరావును సన్మానించి పురస్కారం అందజేశారు. ఈ ఏడాదిలో గుండెదీపానికి రెండోసారి అవార్డు లభించడంతో నెల్లూరులోని కవులు, రచయితలు చిన్ని నారాయణరావును అభినందించారు.

## అపోలోలో మోకాలికి అధునాతన శస్త్రచికిత్స



నెల్లూరు అపోలో ఆసుపత్రిలో ఈ నెల 8వ తేదీ చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డా॥ మదన్ మోహన్‌రెడ్డి, కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డా॥ వివేక్‌రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డా॥ ఏ.విజయ్‌కిషోర్‌రెడ్డి, అనస్థీయిస్ట్ డా॥ ఆనంద్‌లు కలిసి మోకాలి శస్త్ర చికిత్సల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానమైన ఆగ్జీనియమ్ పద్ధతి ద్వారా ఇద్దరు వ్యక్తులకు విజయవంతంగా చికిత్స అందించారు. ఈ సందర్భంగా విలేకర్లతో డా॥ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వయసు పెరిగే కొద్ది మోచిప్పలు అరిగిపోవడం సహజమన్నారు. అరిగిపోయినందువల్ల నడవలేక నొప్పులు విపరీతంగా వస్తాయన్నారు. ప్రారంభంలో మోచిప్పను మార్పిడి చేస్తే అయిదు నుంచి పదేళ్ల వరకు మాత్రమే పనిచేసేదన్నారు. తరువాత కాలంలో ఆపరేషన్ చేస్తే 30ఏళ్ల వరకు మోచిప్పకు భద్రత ఉంటుందన్నారు. ఇప్పుడు వచ్చిన కొత్త టెక్నాలజీతో జీవితాంతం మోచిప్పలకు భద్రత ఉంటుందని తెలిపారు. ఆగ్జీనియం పద్ధతిలో నెల్లూరులో తొలిసారిగా ఒక్కరోజే ఆరు ఆపరేషన్‌లు చేసినట్లు తెలిపారు.

## పూర్ణిమాదేవికి గోల్డ్‌మెడల్



నెల్లూరు నగరానికి చెందిన న్యాయవాది పి.సి.కృష్ణయ్య కుమార్తె పెళ్లకూరు పూర్ణిమాదేవి తిరుపతిలోని పద్మావతి యూనివర్శిటీలో న్యాయశాస్త్రంలో గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ నెల 10వ తేదీన పద్మావతి యూనివర్శిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగిన పద్మావతి మహిళా యూనివర్శిటీ 16వ స్నాతకోత్సవం సందర్భంగా డిఆర్‌డిఓ శాస్త్రవేత్త టెస్సీ థామస్, యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ ఎస్.రత్నకుమారి, రిజిస్ట్రార్ విజయలక్ష్మిలు పూర్ణిమాదేవికి గోల్డ్‌మెడల్ అందజేశారు. గోల్డ్‌మెడల్ సాధించిన పూర్ణిమాదేవికి 'లాయర్' అభినందనలు.

## అలరించిన కవిత్రయ జయంతి సభలు



నెల్లూరు తిక్కవరపు రామరెడ్డి కవిత్రయ జయంతి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8 నుండి 10వ తేదీ వరకు నెల్లూరులోని టౌన్‌హాలులో కవిత్రయ జయంతి సభలు వైభవంగా జరిగాయి. తొలిరోజు పండిత రత్న, విద్యాప్రవీణ శ్రీమాన్ డాక్టర్ కందాళ లక్ష్మీనారాయణ "నానా రుచిరార్థ సూక్తినిధి నన్నయ" అనే అంశంపై ఉపన్యసించి సభికులను ఆకట్టుకున్నారు. అనంతరం కవిత్రయ జయంతి సంఘ సన్మానం అందుకున్నారు. రెండవరోజు కవి పండితులు, బహుగ్రంథకర్తలు, మధురవక్తలు బీరం సుందరరావు "తిక్కన కవితా వైదుష్యం"పై ప్రసంగించి సంఘ సన్మానం అందుకున్నారు. మూడవరోజైన సోమవారం దేవీ భాగవతాది బహుగ్రంథ కర్తలు బ్రహ్మశ్రీ విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు "ఎఱ్ఱన కవితాతత్త్వము"పై అభిభాషించి సంఘ సన్మానం అందుకున్నారు. ఈ మూడురోజులు సభా కార్యక్రమానికి ముందు సుప్రసిద్ధ శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు జె.బాలార్క శిష్యులు ఆర్.గిరిజ, హరిచందన, టి.స్నేహ, ఎ.వైష్ణవి, సుమంత్‌లు ఆలపించిన భక్తి గీతాలాపన వీనులవిందుగా సాగింది.

ఈ కార్యక్రమాలను సంఘ కార్యదర్శి, ద్విసహస్ర సభాసింహం బి.వి.నరసింహం, సభ్యులు అగస్త్యరెడ్డి వెంకురెడ్డి పర్యవేక్షించారు. నగర ప్రముఖులు, సంగీతాభిమానులు, సాహిత్యాభిమానులు, కళాభిమానులు పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# అంతా 'గోవింద' నామమయం

## తిరుమల గిరిగా పులకించి.. పరవశించిన సింహపురి

**ఏమి భాగ్యమిది... ఎంతటి అదృష్టమిది... ఏ జన్మలో చేసుకున్న పుణ్యఫలమిది... ఈ భాగ్యం ఒకరిదా... ఇద్దరిదా... లక్షలాది మంది నెల్లూరీయులది. ఏడుకొండల స్వామి ఏ.సి స్టేడియంకు రావడమేమిటి... ఇక్కడే కొలువుదీరి భక్తులను మంత్రముగ్ధులను చేయడమేమిటి? నిత్యసేవలు, ప్రత్యేక సేవలతో లక్షలాదిమంది భక్తులకు నిత్యం దర్శనభాగ్యం కల్పించడమేమిటి? అంతా ఆ వేంకటేశ్వరుని కరుణా కటాక్షం. వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరుజిల్లా ప్రజలకు కల్పించిన అదృష్టం. లక్షలాదిమంది భక్తులకు శ్రీవారి సేవలను తిలకించే అవకాశం కల్పించి తన జన్మను ధన్యం చేసుకున్నాడు ప్రభాకర్‌రెడ్డి.**

నెల్లూరు తిరుపతి క్షేత్రమైంది. ఏ.సి. స్టేడియం ఏడుకొండలుగా మారింది. తిరుమలలో 9రోజులు సెలవుపెట్టి నెల్లూరుకు విడిది కోసం వచ్చినట్లుగా ఇక్కడే కొలువుదీరాడు శ్రీనివాసుడు. నగరంలో నిద్రలేచింది మొదలు వింత శబ్దాలు, వాహనాల రొద, రైలు కూతలు... ఇంకా ఎన్నెన్నో ధ్వనులు... ప్రతిరోజూ ఈ శబ్దాలే మనకు వినడం అలవాటు! ఆ శబ్దాలే మనకు పాటలైనా, పద్యాలైనా! కాని ఈ నెల 8వ తేదీ నుండి నెల్లూరు నగరంలో వాతావరణమే మారిపోయింది. నెల్లూరొక మినీ తిరుమల క్షేత్రంగా తయారైంది. తెల్లారి నిద్రలేవగానే శ్రావ్యంగా శ్రీవారి సుప్రభాతం వింటున్నాం, తోమాలసేవలో పండితులు చదివే వేదమంత్రాలను వింటున్నాం, గాయనీగాయకులు ఆలపించే శ్రీనివాస చరణాలు, భక్తీగీతాలు, అన్నమయ్య కీర్తనుల... ఇంకా ఎన్నో మనసుకు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. కేవలం తిరుమలకు వెళ్లినప్పుడు మాత్రమే వినగలిగే వేదమంత్రాలు, గోవింద నామాలు అన్నీ కూడా నెల్లూరులో మన ఇంటి వద్దనే మనం వినగలుగుతున్నాం. నెల్లూరు నగరంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర వైభవోత్సవాలు అంత వైభవోపేతంగా జరుగుతున్నాయి.

నెల్లూరులో శ్రీ వెంకటేశ్వర వైభవోత్సవాలు నిర్వహించాలన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంకల్పానికి ఆ దేవదేవుడే ఆశీస్సులందించాడు. వేమిరెడ్డిని ఆయనే ఈ పనికి పురమాయించినట్లున్నాడు. దేవుడి కృపతోనే వెంకటేశ్వర వైభవోత్సవాలకు అన్నీ చక్కగా అమరాయి. టీటీడీ ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి, జెఇఓ పోలా భాస్కర్‌తో పాటు టీటీడీ సిబ్బంది, అర్చకులు ఈ ఉత్సవాల నిర్వహణలో ప్రముఖపాత్ర పోషించారు. కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ తమ సహకారం అందించారు. స్థానికంగా వున్న టీటీడీ ధార్మిక సలహా మండలి, అన్నమయ్య జయంత్యుత్సవ కమిటీ, హిందూ ధర్మ ప్రచారపరిషత్ సభ్యులు ఈ ఉత్సవాల నిర్వహణలో నిమగ్నమై భక్తులకు తమ సేవలందించారు. శ్రీకృష్ణ చరితమానస మండలి వారు వచ్చిన ప్రతి భక్తునికి, భక్తురాలికి తిరునామాలు దిద్దారు.

### అద్భుతమైన సేవలు:

తిరుమలలో మూలవిరాట్ విగ్రహ దర్శనం లోటు తప్పితే మిగతా సేవలు, దర్శనం అంతా కూడా ఇక్కడ తిరుమల స్థాయిలోనే జరగడం విశేషం. ఉదయం 6గంటలకు సుప్రభాతసేవ మొదలవుతుండగా భక్తులు సంప్రదాయ దుస్తులలో వేకువజామున 4గంటలకే వచ్చేస్తున్నారు. ఇలా శ్రీవారికి జరిగే అన్ని సేవలను నిష్టగా తిలకిస్తూ దర్శనం చేసుకుని వెళుతున్నారు. తిరుమలలో శ్రీవారి సేవలలో పాల్గొనే భాగ్యం అందరికీ దక్కదు. కాని నెల్లూరీయులు ఆ అదృష్టాన్ని ఇక్కడే దక్కించుకోవడం విశేషం.

### అపూర్వం... ప్రసాద వినియోగం:

ఈ ఉత్సవాలలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న తీరు అపూర్వమైనది. ప్రసాదాల పంపిణీకి తగినన్ని క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులు తొక్కిసలాట లేకుండా ప్రశాంతంగా వెళ్లి ప్రసాదాలు పొందుతున్నారు. బెల్లం పొంగలి, దద్దోజనం, పప్పుపొంగలి, పులిహోర వంటి ప్రసాదాలను స్వీకరిస్తూ భక్తులు తన్మయం చెందుతున్నారు. ప్రసాదం తీసుకోకుండా ఒక్క భక్తుడు కూడా వెనక్కి వెళ్లే పరిస్థితి లేకుండా ఎక్కువ మోతాదులో ప్రసాదాలను ప్రతిరోజూ సిద్ధం చేస్తున్నారు. భక్తులకు అవసరమైన మంచినీటి వసతి, వగైరాలన్నీ బ్రహ్మాండంగా ఏర్పాటు చేశారు.

శ్రీ వెంకటేశ్వర వైభవోత్సవాలు 7వ తేదీ రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. టీటీడీ ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి, స్వర్ణభారత్ ట్రస్టు ట్రస్టీ దీపా వెంకట్, టీటీడీ పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్‌రెడ్డి, పిఆర్‌ఓ ప్రయాగ రామకృష్ణ, మాజీఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జిల్లా పరిషత్ మాజీఛైర్మెన్ చెంచలబాబు యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తాళ్ళపాక అనూరాధ వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.



8వ తేదీ శనివారం ఉదయం దేవదేవుని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వేకువజాము నుంచి నిత్యసేవలైన సుప్రభాతం, తోమాల సేవ, సహస్ర నామార్చన, నివేదన, శాత్తుమొర, వీధి ఉత్సవం, రెండవ నివేదన, వారోత్సవ సేవ, వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకరణసేవ, వీధి ఉత్సవం రాత్రి కైంకర్యం, ఏకాంత సేవను కనులవిందుగా నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు సమక్షంలో టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి పర్యవేక్షణలో కార్యక్రమ ముఖ్యనిర్వాహకుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతుల నేతృత్వంలో టిటిడి అర్చక బృందాలు నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి విశేషపూజలు, వసంతోత్సవం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తాయి. వసంతోత్సవ జలాలను భక్తులపై చల్లి శ్రీవారి కరుణాకటాక్ష వీక్షణలకు పాత్రులను చేసారు.

9వ తేదీ ఆదివారం తెల్లవారుజామున సుప్రభాతంతో శ్రీవారి నిత్యసేవలు ప్రారంభమయ్యాయి. ఉదయం వసంతోత్సవం, సాయంత్రం శ్రీవారికి నిర్వహించిన సహస్రదీపాలంకరణ సేవ కమనీయంగా జరిగింది. దీపాల వెలుగుల్లో ఉయ్యాలపై స్వామికి ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం వీధి ఉత్సవం, రాత్రి కైంకర్యం, ఏకాంతసేవలు జరిగాయి. ఆధ్యాత్మిక ప్రవచకులు మైలవరపు శ్రీనివాసరావు ప్రవచనం గావించారు.

10వ తేదీ సోమవారం కాళీయమర్ధనుడి అలంకారంలో శ్రీనివాసుడు భక్తులకు దర్శనమిచ్చాడు. సహస్ర దీపాలంకరణతో దేదీప్యమానంగా వెలుగొందుతున్న వేదికపై ఉయ్యాలలో శ్రీ వెంకటేశ్వరునికి ఊంజల్ సేవను అర్చకస్వాములు కమనీయంగా జరిపించారు. అనంతరం స్వామివారు వీధి ఉత్సవంలో మంగళవాయిద్యాలతో, భక్తుల గోవింద నామస్మరణలతో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి కామినేని శ్రీనివాస్ వైభవోత్సవాల్లో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు.

11వ తేదీ మంగళవారం శ్రీవారికి నిర్వహించిన అష్టదళ పాద పద్మారాధన భక్తులకు కనువిందు చేసింది. సకల లోకాలను పాలించే ఆ దేవదేవుడి పాదపద్మములను అర్చకస్వాములు 108 కలువ పూలతో పూజించారు. తిరుమల ఆస్థాన వంశపారంపర్య అర్చకుడు వేణుగోపాల దీక్షితులు, ఆగమ పండితులు, వేద పండితుల ఆధ్వర్యంలో ఈ ఆరాధన వైభవంగా జరిగింది. యధావిధిగా ఉత్సవాల్లో ఉదయం 6గంటలకు స్వామివారిని సుప్రభాతంతో మేలుకొలిపారు. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ, వీధి ఉత్సవం నయనానందకరంగా జరిగాయి. రాత్రి కైంకర్యం అనంతరం ఏకాంతసేవ నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఎం.జానకి, ఉత్సవ నిర్వహణ దాతలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, స్వర్ణభారత్ ట్రస్టు ట్రస్టీ దీపావెంకట్ తదితరులు పాల్గొన్నారు.

12వ తేదీ బుధవారం శ్రీవారికి నిర్వహించిన సహస్రకలశాభిషేకాన్ని శాస్త్రోక్తంగా టిటిడి అర్చకులు వైభవంగా నిర్వహించారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వరుడికి తిరుమలలో ప్రతి బుధవారం నిర్వహించే రీతిలో ఆలయ అర్చకులు, వేద పండితులు వారోత్సవసేవ, సహస్ర కలశాభిషేకాన్ని నిర్వహించగా భక్తులు కనులారా వీక్షించి తన్మయత్వం చెందారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్, టిటిడి డిప్యూటి ఇఓ చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

13వ తేదీ గురువారం తిరుమలలో ప్రతి గురువారం నిర్వహించే రీతిలో తిరుప్పావడసేవను టిటిడి అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలతో కనులవిందుగా నిర్వహించారు. శ్రీవారికి ప్రీతికరమైన పులి హోరను రాశిగా పోసి విశేష పూజలనంతరం స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సుప్రభాత సేవలో పాల్గొని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి విశేష పూజలు నిర్వహించారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని విశేషపూజలు నిర్వహించారు.

14వతేదీ అభిషేకం, 15వతేదీ శ్రీనివాస కళ్యాణం, 16వ తేదీ పుష్పయాగంతో ఈ వైభవోత్సవాలు ముగియనున్నాయి. ఇప్పటివరకు స్వామివారిని దర్శించుకోని భక్తులు ఈ మూడురోజులు జరిగే విశేష పూజల్లో పాల్గొని శ్రీవారి తీర్థప్రసాదాలు స్వీకరించి వెళ్లాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# శ్రీవారి సేవలను చూడగలగడం... జన్మజన్మల పుణ్యం

## - బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, ఆదిమధ్యాంతరహితుడు, కలియుగ ప్రత్యక్షదైవం, భక్తుల కొంగుబంగారమైన ఆ శ్రీ వేంకటేశ్వరునికి జరిగే సేవలను కళ్ళారా చూడగలగడం మనం చేసుకున్న జన్మజన్మల పుణ్యమేనని, తిరుమలలో ఆ దేవదేవునికి జరిగే సేవలను నెల్లూరులో జరుగుతున్న శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాల్లో భక్తులందరూ తిలకించగలగడం కంటే మహద్భాగ్యం ఇంకేముంటుందనీ బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు.

నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో, తిరుమల తిరుపతి దేవస్థానాల వారు, హిందూ ధర్మప్రచార పరిషత్తు వారి ఆధ్వర్యంలో, నెల్లూరుకు చెందిన ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి నేతృత్వంలో ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకు జరిగే శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాల అంకురార్పణకు చాగంటి విచ్చేశారు. ఈ నెల 7వ తేదిన శ్రీవారి ఉత్సవాల అంకురార్పణ సందర్భంగా ఆయన ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. 'శ్రియ: కాన్తాయ కల్యాణ నిధయే.. నిధయేర్థినామ్'.. అన్నట్లుగా ఆ శ్రీ వేంకటేశ్వరస్వామి సమస్త కల్యాణ గుణాలకు నిధి అనీ, లోకమనోభిరాముడైన శ్రీనివాసుడు రాశీభూతమైన దయాస్వరూపుడని, ఆ స్వామిని దర్శించుకున్నా, ఆయన నామస్మరణ చేసినా చాలు సమస్త పాపాలూ పోయి, సకల శుభాలూ కలుగుతాయని ఆయన అన్నారు. శ్రీవారి పాదాలను ఆశ్రయించినవారికి సత్కీర్తి కలుగుతుందని, గొప్ప పుణ్యం లభిస్తుందని అన్నారు. శ్రీవారి పాదాల కింద ధ్వజ, శంఖ, గద, అమృతభాండం ముద్రలు వుంటాయన్నారు. గత జన్మల పాపాలను కూడా పరిహరించేవి శక్తివంతమైన శ్రీవారి పాదాలేనని, ఆ పాదాలను పూజించినా, దర్శించినా మన జన్మ ధన్యమవుతుందని అన్నారు. పరమాత్మ అనుగ్రహానికి పరాకాష్టగా ఆ పాదాలను దర్శించే మహద్భాగ్యం మనకు ఈ వైభవోత్సవాల్లో కలుగుతోందని అన్నారు. మనకేది కావాలో దానిని అనుగ్రహించే సన్నిధి ఏడుకొండలేనని, మన కోరికలు తీర్చే పెన్నిధి ఆ శ్రీవేంకటేశుడేనని ఆయన అన్నారు. సాక్షాత్తూ ఆ స్వామివారే ఇక్కడికి దిగి వచ్చి మనలను అనుగ్రహించడం, ఎన్నో పూజలు, సేవలు అందుకోవడం ఒక అద్భుతమైన విశేషమని, ఈ తొమ్మిది రోజులపాటూ ప్రతిరోజూ ఆ సేవలను చూసే భాగ్యం నెల్లూరుకు రావడం మహదానంద కరమని, ఇది ఇక్కడి భక్తుల పూర్వజన్మ సుకృతమనీ అన్నారు. శ్రీ వేంకటేశ్వరుని వైభవోత్సవాల్లో భాగంగా, ఇక్కడ ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల దాకా తిరుమల నుంచి విచ్చేసిన అర్చకబృందంవారు అత్యద్భుతంగా శ్రీవారి సుప్రభాత సేవను నిర్వహిస్తారని, శ్రీవారి సుప్రభాతాన్ని వీనులవిందుగా వినగలిగే భాగ్యం మనకు కలుగుతుందని, అంతేకాక అర్చక బృందంతోపాటు భక్తులు కూడా స్వామివారి సుప్రభాతాన్ని పఠించగలిగే మహద్భాగ్యం ఈ వైభవోత్సవాల్లో కలుగుతుందని ఆయన అన్నారు. ఒకవైపు ఆ దివ్యమంగళస్వరూపుని కన్నులారా తిలకిస్తూ, మరోవైపు తిరుమలలో విన్నట్లుగా ఆ దివ్యమైన స్వామివారి సుప్రభాతగానాన్ని వింటూ, ఇంకోవైపు మనమే స్వయంగా సుప్రభాతాన్ని పఠించే అరుదైన అవకాశం మనకు ఇంకెక్కడా లభించదని, ఒక్క శ్రీవారి వైభవోత్సవాల్లోనే ఆ భాగ్యం మనకు లభిస్తుందని, కనుక భక్తులందరూ ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ సదవకాశాన్ని జారవిడుచుకోకుండా, ప్రతి ఒక్కరూ ప్రతి ఉదయం సుప్రభాత సమయం కంటే ముందుగానే వేకువన 5.30 గంటలకల్లా ఈ వైభవోత్సవాలకు తరలిరావాలని ఆయన అన్నారు. అదేవిధంగా, తిరుమలలో జరిగే శ్రీస్వామి వారి విశిష్టమైన సేవలెన్నిటినో మనం కన్నులారా ఈ వైభవోత్సవాల్లో తిలకించవచ్చుని, కొన్ని సేవలను తిరుమలకు వెళ్ళినా మనం చూడలేమని, అలాంటి సేవలను కూడా ఇక్కడ మనం చూడవచ్చుని, అన్ని సేవలనూ ఇక్కడ దర్శించగలిగే మహాపుణ్యం నెల్లూరీయులదేనని అన్నారు. సాక్షాత్తూ ఆ తిరుమలగిరే..సింహపురిగా అవతరించిందా అన్నట్లుగా ఈ వైభవోత్సవాలు జరగడం నెల్లూరువాసుల అదృష్టమని అన్నారు. వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో, తులసీదళాలతో స్వామివారి నామాలను అర్చకులు పలుకుతుండగా, భక్తులు 'గోవిందా' అంటూ మనసారా అందరూ కలసి ఏకకంఠంతో గోవిందనామాలు పలికే దివ్యమైన సన్నివేశం ఈ వైభవోత్సవాల్లోనేనని ఆయన అన్నారు. 'గోవింద' నామమే ఈ కలియుగంలో మనందరికీ రక్షాదారమని, గోవిందనామాలతో ఆ స్వామిని అర్చించడం ఎంతో పుణ్యప్రదమనీ అన్నారు. నిత్యం స్వామివారి సుప్రభాతసేవ మొదలకుని, ఈ 9 రోజులూ ఎంతో విశిష్టమైన తోమాల సేవ, కొలువు, అర్చన, సహస్రనామార్చన, నివేదన, శాత్తుమొర, వసంతోత్సవం, తిరువీధి ఉత్సవం, సర్వదర్శనం, సహస్ర దీపాలంకరణ సేవ, రాత్రి కైంకర్యం, ఏకాంత సేవ, విశేషపూజలు, ఎంతో అరుదైన అష్టదళ పాదపద్మారాధన సేవ, సహస్ర కలశాభిషేకం, తిరుప్పావడ (అన్న కూటోత్సవం), ఎంతో పుణ్యప్రదమైన అభిషేక సేవ.. ఇలా అన్నిసేవలనూ కళ్లారా చూసే అవకాశం మనకు ఇక్కడ లభిస్తోందని అన్నారు. వైభవోత్సవాల్లో భాగంగా, ఈ నెల 15న శనివారం మరింత విశేషంగా సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు 'శ్రీనివాస కల్యాణం' అత్యంత వైభవంగా జరుగుతుందని, అదేవిధంగా, ఆదివారం ఉదయం 9 గంటలకు కన్నులపండువగా శ్రీ వేంకటేశ్వరునికి 'పుష్పయాగం' జరుగుతుందని ఆయన అంటూ, ఈ సేవలన్నింటికీ భక్తులందరూ పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. భక్తులందరికీ ఎలాంటి ప్రవేశ రుసుమూ లేకుండా, ఉచితంగా స్వామివారిని దర్శించుకునే భాగ్యం, స్వామివారి నిత్యసేవలను, వారోత్సవాలను తిలకించే అవకాశం కల్పించడంతో పాటు, ప్రతిరోజూ స్వామివారి అన్నప్రసాద వితరణ వుంటుందని, ఈ వైభవోత్సవాలకు భక్తులందరూ వేలాదిగా తరలివచ్చి, స్వామివారి సేవలను, వేడుకలను తిలకించి ఆ దేవదేవుని దర్శించుకుని తరించాలని ఆయన కోరారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## రవాణా డ్రైవర్లకు ఉచిత బీమా



రవాణా డ్రైవర్లకు బీమా నమోదు చేస్తున్న కార్మిక సహాయ కమిషనర్ కె.ఓంకార్

రవాణా డ్రైవర్లు ఉచిత బీమా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సులభతరం చేసిందని గూడూరు కార్మిక సహాయ కమిషనర్ కె.ఓంకార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన వివరాలు వెల్లడించారు. లైసెన్స్‌లో రవాణా అని ముద్రించి వుంటే వారందరూ ఉచిత బీమా చేసుకోవచ్చని, కేవలం లైసెన్సు, ఫోన్ నంబర్లు మాత్రమే నమోదు చేసుకొంటే సరిపోతుందన్నారు. తర్వాత ఫోన్‌కు పేరు నమోదు అయినట్లు సందేశం వస్తుందని, దీంతో మీ సేవ, అంతర్జాలం, కార్మికశాఖ కార్యాలయంలో దరఖాస్తు పూర్తి చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశం ఈ నెల 31 వరకే ప్రభుత్వం కల్పిస్తోందని, డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మికశాఖాధికారి సురేష్‌కుమార్, సిబ్బంది స్వర్ణలత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఇటీవల నెల్లూరులో స్పీకర్ కోడెల శివప్రసాద్, మంత్రి నారాయణను కలసిన గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన

## వైద్యశాలను తనిఖీ చేసిన సబ్‌కలెక్టర్


సిబ్బందితో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ గిరీషా

గూడూరు ప్రాంతీయ వైద్యశాలను 8వ తేదీ సబ్‌కలెక్టర్ పిఎస్ గిరిషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డుల్లోకి వెళ్లి అక్కడున్న సౌకర్యాల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రక్తనిధి, ఎక్స్‌రే గది, సీమాంక్ కేంద్రాలను పరిశీలించారు. రక్తనిధిలో మూడు ప్యాకెట్లు రక్తం ఉండటాన్ని చూసి నివ్వెరపోయారు. మృతదేహాలను ఉంచే పెట్టె పనిచేయక పోవడాన్ని, ఆసుపత్రిలో అధ్వాన్నంగా వున్న పారిశుద్ధ్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలని, ఆసుపత్రి వెనుక నిలిచివున్న మురుగునీరు బయటకు పంపేలా చేయాలని పురపాలక సంఘ సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో తాగునీరు లేకపోవడం ఏమిటని, వెంటనే నీరు రోగులకు అందుబాటులో తేవాలని సూచించారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే సహించమన్నారు. వైద్య చికిత్సల పరంగా ఆసుపత్రిలో వైద్యులు బాగా పనిచేస్తున్నారని, ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం దస్త్రాలను పరిశీలించి నిర్లక్ష్యంగా విధులకు రాకుండా వున్న వైద్యులకు జీతాలు నిలుపుదల చేయాలన్నారు. సిబ్బంది కొరతపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు.

## నెల్లటూరులో ఉచిత కుట్టు శిక్షణ


కుట్టు శిక్షణను పరిశీలిస్తున్న ఎంపిపి రావమ్మ, దాత కోట సునీల

గూడూరు మండలంలోని నెల్లటూరు గ్రామాన్ని దత్తతు తీసుకొన్న సాయి సత్సంగ సేవాసమితి నిర్వాహకులు కోట సునీల్‌కుమార్ సోమవారం గ్రామంలో మహిళలకు కుట్టు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎంపిపి పి.రావమ్మ మాట్లాడుతూ ఈ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాయి సత్సంగ నిర్వాహకులు కోట సునీల్ మాట్లాడుతూ మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, చివర్లో ప్రతిభ కనబరచిన వారికి కుట్టు యంత్రాన్ని బహుమతిగా ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల అధికారిణి బి.పద్మ, గ్రామసర్పంచ్ బుజ్జమ్మ, నాయకులు పి.నాగరాజు, వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు రోటరీ ఫలసరుకులు



వృద్ధురాలికి ఫలసరకులిస్తున్న క్లబ్ అధ్యక్షుడు అశోక్‌చక్రవర్తి, ప్రక్కన తలమంచి సిద్ధారెడ్డి

గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ హెల్పేజ్ ద్వారా అందజేస్తున్న ఫలసరుకులను వృద్ధులకు స్థానిక రోటరీ భవనంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఎస్వీ అశోక్ చక్రవర్తి మాట్లాడుతూ హెల్పేజ్ ప్రారంభించి పదేళ్లు పూర్తవుతోందన్నారు. దివంగత అల్లూరు ఆదిశేషారెడ్డి సాయంతోనే నిర్విరామంగా కార్యక్రమాలు కొనసాగాయన్నారు. ప్రస్తుతం 71మందికి ఇస్తున్నామని, అది 100మంది దాకా పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తలమంచి సిద్ధారెడ్డి, కన్వీనర్ జానకిరామిరెడ్డి, సహాయకార్యదర్శి హరిప్రసాద్, రోటేరియన్లు కె.మునిగిరీష్, జీడిరెడ్డి, కె.సుందరరామిరెడ్డి, కనుమూరు హరిశ్చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం

సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫాన్స్ జిల్లా అధ్యక్షుడు దరిశి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నెల్లూరు నర్తకి సెంటర్‌లో 'శ్రీమంతుడు' మహేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఈ శిబిరంలో కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో దరిశి సురేష్‌బాబు, సిరాజ్, రఘు, వెంకు, షుక్కూర్, బ్లడ్ మోటివేటర్ బయ్యా ప్రసాద్, రమణ, ప్రసాద్, అవినాష్, అశోక్, అభిమానులు పాల్గొన్నారు.

## కాలధర్మం

### బండి విశ్వనాథం




ప్రముఖ సంస్కృత భాషా పండితులు, రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత బండి విశ్వనాథం ఈ నెల 5వ తేదీ స్వర్గస్థులైనారు. 1945లో పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులో ఆయన జన్మించారు. కొవ్వూరు, విజయనగరం, తిరుపతిలలో విద్యను అభ్యసించి, నెల్లూరు మూలాపేటలోని వేద సంస్కృత పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయునిగా చేరి, 2003లో ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగ విరమణ చేశారు. ఉభయ భాషా ప్రవీణుడైన విశ్వనాథం సంస్కృత పాఠ్య పుస్తకాన్ని రచించారు. పలు సాహితీ సంస్థలు, వివిధ ధార్మిక సంస్థలు నిర్వహించిన కార్యక్రమాలలో పాల్గొనేవారు. ఆకాశవాణి విజయవాడలో అనేకమార్లు సంస్కృత ప్రసంగాలు, సూక్తి ముక్తావళి నిర్వహించారు.

సంస్కృత భాషా ఉపాధ్యాయునిగా చేసిన విశిష్ట సేవలకు గాను 1988లో అప్పటి భారత రాష్ట్రపతి ఆర్.వెంకట్రామన్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార సత్కారాన్ని ఢిల్లీలో పొందారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## మహోన్నత శాస్త్రవేత్త.. కలాం

### - విఆర్‌సిలో నివాళి

భారత మాజీ రాష్ట్రపతి, క్షిపణి పితామహుడు డాక్టర్ ఏపిజె అబ్దుల్‌కలాంకు నెల్లూరు విఆర్ కళాశాల, ఫిజిక్స్ విభాగం అధ్యాపకుల ఆధ్వర్యంలో ఇటీవల ఘనంగా నివాళులర్పించారు. కలాం చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాలతో అలంకరించారు. కలాం ఆత్మకు శాంతి చేకూరాలని విద్యార్థులు, అధ్యాపకులు భగవంతుని ప్రార్థించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, నిరుపేద కుటుంబంలో జన్మించిన అబ్దుల్‌కలాం క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. దేశంలోని అత్యున్నత పదవిని సైతం అధిష్టించి దేశానికి గొప్ప సేవలందించారని ప్రశంసించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కలాం చేసిన సేవలు ఎంతో అద్భుతమైనవని, ఆయన గొప్ప శాస్త్రవేత్త కాక, గొప్ప మానవతావాది అని, భావితరాలకు ఆయన మార్గదర్శకులని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌సి ప్రిన్సిపల్ డాక్టర్ సివిఎస్ భాస్కర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.బాబు, ఫిజిక్స్ విభాగం అధిపతి డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, డాక్టర్ జి. కృష్ణకిషోర్, బి.వేమారెడ్డి, డాక్టర్ ఎస్.బాబర్, ఎన్.మనుమంత కుమార్, జి.అనంతశేషసాయి, డాక్టర్ ఎం.పద్మప్రియ, శ్రీవాణి, ఆర్.గోపి, డాక్టర్ టి.వి రవీంద్రరెడ్డి, డాక్టర్ ఎన్.ప్రభాకర్, జి.వేణు, ఎన్.అనిత తదితర అధ్యాపకులు, అధికసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.




## వివాహ పరిచయ వేదిక

నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, కడప జిల్లాలకు సంబంధించి బలిజ, కాపు, తెలగ వివాహ పరిచయవేదికను ఈ నెల 16వ తేదీ ఆదివారం నెల్లూరు, టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు వేదిక వ్యవస్థాపకులు ఏకోజి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేదికలో పాల్గొనదలచిన వారు రిజిస్ట్రేషన్ కొరకు రెండు మాక్సీసైజు ఫోటోలను తీసుకుని తల్లిదండ్రులతో కలిసి రావాలని, వివరాలకు 9398314847, 8500562001 నెంబర్లలో సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 14.08.2015 నుండి
తేది. 20.08.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, కర్కాటకంలో రవికుజ శుక్రులు, 17 తేది నుండి సింహంలో రవి, సింహంలో గురుబుధులు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, కర్కాటకంలో సింహ కన్య తులా రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 15 శనివారము స్వాతంత్ర్యదినోత్సవము
తేది 17 సోమవారం కన్యా భాద్రపద మాసము శూన్య మాసమంటారు.


**నిజాషాఢ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 14 | శుక్ర | అమావాస్య | రా॥ గం.7.22ని॥ |

**శ్రావణ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 15 | శని | పాడ్యమి | రా॥ గం.8.44ని॥ |
| తేది. 16 | ఆది | విదియ | రా॥ గం.10.30ని॥ |
| తేది. 17 | సోమ | తదియ | రా॥ గం.12.27ని॥ |
| తేది. 18 | మంగళ | చతుర్థి | రా॥ గం.2.32ని॥ |
| తేది. 19 | బుధ | పంచమి | రా॥ గం.4.29ని॥ |
| తేది. 20 | గురు | షష్ఠి | పూర్తిగ ఉన్నది |

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఖర్చులు, చెల్లింపులు ఎక్కువగా ఉంటాయి. ఆర్థికమైన వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండండి. వృత్తి వ్యాపారాల వృద్ధి, ఆదాయం సంతృప్తికరం. అనుకున్న పనులు నిదానంగా జరుగుతూ విసుగు కలిగిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలలోనున్న వారికి అనుకూలత బాగున్నది. ఉద్యోగులకు పనిభారం, స్థానమార్పులుంటాయి. స్థిరాస్తుల నుండి ఆదాయముంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి, ఆదాయము పెరుగుతుంది. అయితే ఆడంబరాలకు మొగమాటాల కారణంగా ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యమైన విషయాలు స్వయంగా పర్యవేక్షిస్తే లాభాలుంటాయి. షేర్లు పెట్టుబడులందు అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగార్థులు దొరికిన అవకాశం వినియోగించుకొనాలి. కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం బాగుంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. కొత్త వ్యాపార ఆలోచనలు, పెట్టుబడి అవకాశాలకు రూపమివ్వండి. వృత్తి వ్యాపారాలలో ఆర్థికంగా బలపడతారు. ఆదాయం పెరుగుతుంది. అయితే అదనపు ఖర్చులను భరించక తప్పదు. స్థిరాస్తుల క్రయవిక్రయాలకు అనుకూల సమయం. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, స్థానమార్పులుంటాయి. నూతన వస్తు లాభం ఉంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

మంచివాళ్లతో పరిచయాలుంటాయి. ఇంట బయట మీ సామర్థ్యంతో ఎదుటి వారిని ఆకర్షించగల శక్తి ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధికై శ్రమపడి ఆదాయం పెంచుతారు. పెట్టుబడులకు అనుకూల అవకాశాలుంటాయి. ఉద్యోగులకు అధికారుల అనుకూలత స్థాన మార్పులుంటాయి. పెండింగ్ సమస్యలు పరిష్కారానికి వస్తాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి. వృత్తి వ్యాపారాలలోను, నిర్మాణాలకు గాని కొత్త ఋణాలకు ప్రయత్నాలు జరుగుతాయి. గృహ వస్తువాహన రిపేర్ల ఖర్చులుంటాయి. ఇంట్లో స్త్రీలకు కొద్ది అనారోగ్య బాధలుంటాయి. అనుకున్న పనులను హడావుడిగా చేయవలసి వస్తుంది. మీ సొంత విషయాలలో ఇతరులు జోక్యం చేసుకొనకుండా చూసుకొనండి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థిక ఇబ్బందులుంటాయి. ఖర్చులు పెరుగుతాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. ఋణాల వత్తిడి పెరుగుతుంది. బంధువులతోను, మిత్రులతోను భేదాభిప్రాయాలు ఏర్పడవచ్చును. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. రాబడి సంతృప్తికరంగా ఉండదు. శాస్త్ర సాంకేతిక వైద్య రంగాల వారికి పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. విద్యా ప్రగతి ఉంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఇంట బయట అనుకూల పరిస్థితులేర్పడి అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. ఆర్థికంగా కొత్త ప్రణాళికలు, ప్రయత్నాలతో ముందుకు సాగుతారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. ఎదుటి వారి విమర్శలకు ధీటుగా సమాధానమిస్తారు. ఉద్యోగులకు అధికారులతో సఖ్యత, స్థానమార్పులు ఉండగలవు. ఆరోగ్యం బాగుంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆలోచనలు నిలకడగా ఉండక, అనుకున్న పనులను హడావిడిగా చేయవలసి వస్తుంది. ముఖ్య వ్యవహారాలలో పెద్దల సలహాలు తీసుకొనడం మంచిది. వ్యాపార వర్గాల వారికి అభివృద్ధి రాబడి బాగుంటుంది. ప్రభుత్వం అనుమతులు ఆలస్యం కావచ్చును. దేశ విదేశ ప్రయాణాలు నిర్ణయం కాగలవు. పెట్టుబడులకు అవకాశాలు, శుభ కార్య నిర్ణయాలు జరుగగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

మీ నుండి సమాచారాలు సేకరించి మిమ్మల్ని ఇబ్బంది పెట్టే వారుంటారు, కాబట్టి జాగ్రత్త అవసరం. వాహనాలు నడిపేవారు, యంత్రాలతో, కరెంటుతో పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. స్థిరాస్తుల లావాదేవీలను వాయిదా వేసికొనండి. రావలసిన బాకీలు లభించవు. పెద్దమొత్తాలలో పెట్టుబడులు ప్రస్తుతానికి వద్దు. ఉద్యోగార్థులకు అవకాశాలు ఆలస్యం కావచ్చు.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

తొందరపాటు నిర్ణయాలు తీసికొని ఇబ్బందిపడే పరిస్థితులున్నాయి. వ్యాపారవర్గాలకు అభివృద్ధి అవకాశాలు చేజారిపోవచ్చును. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. బంధువర్గాల వల్ల సమస్యలు కలిగే అవకాశం ఉన్నది. కోర్టు వ్యవహారాలలో అనుకూలత తక్కువ. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్త అవసరం. అనుకోని ప్రయాణాలుంటాయి. కుటుంబసౌఖ్యం కలదు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపారాలలో మంచి ఆర్థికావకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. అయినా అనుకోని అవసరాలు ఏర్పడి ఋణం చేయవలసి వస్తుంది. పెద్ద మొత్తాలలో ఆర్థిక పెట్టుబడులు ప్రస్తుతం చేయవద్దు. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు ఉండకపోవచ్చును. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనండి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులకు అధికారుల సహకారం, స్థానమార్పులుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

చేపట్టిన, చేయదలచిన పనులకు పరిస్థితులు అనుకూలించగలవు. శాస్త్ర సాంకేతిక వైద్య రంగాల వారికి మంచి అభివృద్ధి, ఆర్థికావకాశాలుంటాయి. వ్యాపార వర్గాలకు సామాన్య ఆదాయం. ప్రభుత్వ అనుమతులు లభించగలవు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. ఉద్యోగులకు స్థానమార్పులు, పనిభారం ఎక్కువగా ఉంటుంది.

# వైకుంఠ వాసికి తప్పని నెల్లూరు దోమల పోటు

శ్రీను గల్పిక

అవి ప్రపంచాన్ని ఏలే దేవుడు శ్రీ వేంకటేశ్వరుడు కొలువైన సప్తగిరులు. ఏడుకొండల ప్రవేశ ద్వార ప్రాంతమైన అలిపిరి మెట్ల ప్రాంతం. మాజీఎమ్మెల్యే స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(64) తిరుమలకు వెళ్లడానికి మెట్ల మీద నడక మొదలుపెట్టాడు. వెంట పిఏలు రాజు, ఫణిలు సాయంగా ఉన్నారు. వివేకా భక్తితో పది మెట్లు ఎక్కగానే "ఏడు కొండల స్వామి ఎక్కడున్నావయ్యా... ఎన్ని మెట్లెక్కినా కానరావేమయ్యా" అనే ఘంటసాల పాటందుకున్నాడు. పిఏలు మనసులో పది మెట్లెక్కగానే స్వామి కనిపిస్తాడా, కొండలన్నీ ఎక్కాక కదా కనిపించేదని అనుకున్నారు. తర్వాత వివేకా ఘంటసాల పాటలతో పాటూ "కొండల్లో నెలకొన్న కోనేటి రాయుడు వాడు", "అదిగో అల్లదిగో శ్రీహరివాసము" వంటి అన్నమయ్య కీర్తనలను పాడుకుంటూ కొండెక్కేసాడు. తర్వాత స్నానం చేసి విఐపి క్యూలో స్వామి దర్శనానికి వెళ్లాడు. అన్నమయ్య, తరిగొండ వెంగమాంబ, భక్త కన్నప్ప వంటి భక్తుల కోవకు చెందినవాడు కాబట్టి వివేకాకు వెంకటేశ్వరస్వామి నిజ రూప దర్శనం ఉంటుంది. పోయినప్పుడల్లా వెంకటేశ్వరస్వామితో మాట్లాడడం, సమస్యలు చెప్పుకోవడం చేస్తుంటాడు. స్వామిని చూడాలనే ఆతృతతో వివేకా గర్భగుడిలోకి ప్రవేశించాడు. అప్పటిదాకా భక్తితో మూసి వున్న కళ్లను తెరిచాడు. ఏం లాభం, కంటికి ఎదురుగా ఏమీ కనిపించడం లేదు. కళ్లకు పెట్టిన నల్లద్దాలు తీయడం మరచిపోయానేమోననుకుని చేతులతో కళ్ల వద్ద తడిమి చూసాడు. కళ్లకు అద్దాలు ఏమీ లేవు. ఎదురుగా ఆయనకు వేంకటేశ్వరస్వామి కనిపించట్లేదు. నా స్వామి ఏమైపోయినట్లు, నేనొస్తున్నాని ఏమన్నా భయపడి వెళ్లిపోయాడా?... అయినా నా ముఖం చూడకుండా పోయేంత తప్పు నేనేం చేసాను అని మనసులో దిగులు పడుతూ వెనక్కి తిరిగాడు. అప్పుడే లోపలకు డాలర్ శేషాద్రి వచ్చారు. ఆయన్ను చూడగానే వివేకా... స్వామీ, పెద్దాయన కనిపించట్లేదు, ఎక్కడకు వెళ్లిపోయాడు అని అడిగాడు. అందుకు శేషాద్రి... వివేకా, నీకు ఈ విషయం తెలీదా, మీ నెల్లూరులోనే శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాలను నిర్వహిస్తున్నారు కదా, ఆ ఉత్సవాల్లో పాల్గొనడానికి వెళ్లాడు. 9రోజుల పాటు అక్కడే వుంటాడు. తిరుమలలో ఉండి ఆయనకు బోరుకొట్టింది. ఎప్పుడూ చూసే ముఖాలు, ఎప్పుడూ తిరిగే కొండలే కదా, కొంచెం ఆట విడుపుగా వుంటుందని స్వామి వారు దేవేరులతో కలిసి వెళ్లారు. అదీగాక 'బాహుబలి', 'శ్రీమంతుడు' అనే కొత్త సినిమాలు వచ్చాయి. స్వామిని చూడ్డానికి వచ్చిన భక్తులు క్యూలైన్లలో నిలబడి ఆ సినిమాల గురించే చర్చించుకుంటుంటే ఆయన విన్నారు. దాంతో ఆ సినిమాలను చూడాలనే ఉబలాటం స్వామికి కూడా పెరిగింది. నెల్లూరులో ఎస్2 థియేటర్లు బాగుంటాయట కదా... అందుకే ఆయన నెల్లూరెళ్లాడని చెప్పాడు. వివేకా ఆదుర్దాగా... తల మీద కిరీటం, ఒంటి మీద నగలతో అలాగే వెళ్లిపోయాడా, లేక అవన్నీ భద్రపరచుకుని మఫ్టీలో వెళ్లాడా అని అడిగాడు. స్వామి అలంకారప్రియుడు కదా నాయనా, వాటితో పాటే వెళ్లాడని శేషాద్రి చెప్పాడు. ఆ మాటకు వివేకా బాధతో... అయ్యో, స్వామిని కాపాడేదెవరు? ఆయన నగలకు రక్షకుడెవరు? అని వాపోసాగాడు. ఆయన బాధ చూసి శేషాద్రి... స్వామివారి నగల గురించి అంతగా బాధపడిపోతున్నావేం వివేకా అని అడిగాడు. వివేకా అందుకు... ఏం చెప్పేది స్వామి... నెల్లూరులో కాపువీధి, మండపాల వీధిలో బంగారు వ్యాపారస్తులు దుకాణాలకు తలుపులు కూడా పెట్టుకోరు. ఆ ఏరియాలో నేనుంటాను కాబట్టి నైట్ సెక్యూరిటీ గార్డ్‌లను కూడా పెట్టుకోరు. నా మీద వాళ్లకు అంత నమ్మకం. నేను పగలు ఎక్కడ తిరిగినా రాత్రిళ్లు సెకెండ్‌షో తర్వాత మా ఏరియాలో తిరుగుతుంటాను. కాబట్టి దొంగలెవరూ ఆ వైపు కన్నెత్తి కూడా చూసేవాళ్లు కాదు. అయితే మొన్న జరిగిన సంఘటనతో బంగారు అంగళ్లోళ్లకు నా మీద నమ్మకం పోయిందని వాపోయాడు. ఏం జరిగిందని శేషాద్రి అడిగాడు. మా ఇళ్లున్న సందులోనే పట్టపగలు ముగ్గురు ఆగంతకులు ఒక బంగారు అంగడిలో జొరబడి తుపాకులు చూపి రెండున్నర కేజీల బంగారం ఎత్తుకెళ్లారు స్వామి, నేనున్న ఏరియాలో నేనున్నప్పుడే దొంగలు పడ్డారు. ఇక నేను లేని టైంలో వెంకటేశ్వ స్వామి నెల్లూరెళ్లాడు... అసలే ఆమాయకుడు. ఆయన వంటి మీద నగలు ఏమవుతాయోనని నా భయమన్నాడు. దానికి శేషాద్రి... వివేకా, నెల్లూరులో జరిగిన సంఘటనలో నీ తప్పేమీ లేదు. నువ్వు రాత్రిళ్లు మాత్రమే కాపలాదారుడివి. రాత్రి దోపిడీ జరిగివుంటే నీ అసమర్థత అనుకోవాలి. పగలు జరిగింది కాబట్టి నీకేం బాధ్యత చెప్పు... ఈ బాధనేం మనసులో పెట్టుకోక నువ్వు నెల్లూరెళ్లి ముందు స్వామిని చూసుకోపో... అని చెప్పాడు. వెంటనే వివేకా కారెక్కి నెల్లూరువైపు బయల్దేరాడు.

★ ★ ★ ★ ★

నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం... శ్రీ వెంకటేశ్వర వైభవోత్సవాలలో భాగంగా ముందుగా సుప్రభాతం మొదలు కానుంది. టిటిడి పండితులు పూజా కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు. ఉత్సవాల నిర్వాహకుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, నైట్‌రైడర్, మంత్రి పి.నారాయణ, దేవాలయాల మంత్రి మాణిక్యాలరావు, టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డిలు, ఇతర భక్తులు నిలబడి వున్నారు. అప్పుడే వివేకా కూడా అక్కడకు చేరుకున్నాడు. వేదపండితులు సుప్రభాతం చదివాక స్వామికి అడ్డుగా వున్న తెర తొలగించారు. స్వామివారి విగ్రహాన్ని చూసి... అందరూ గోవిందా... గోవిందా అని భక్తితో నినాదాలు చేయసాగారు. వివేకా మాత్రం అటువైపు చూసి కూడా చాలా నిర్లిప్తంగా వున్నాడు. ఆయన వాలకం చూసిన వెంకయ్యనాయుడు... ఏం వివేకా, నీకు స్వామి మీద భక్తి లేదా, కనీసం స్వామికి దణ్ణం కూడా పెట్టలేదన్నాడు. వివేకా పెద్దగా నవ్వి... అక్కడ స్వామి ఉంటే కదా దణ్ణం పెట్టడానికి, ఆయన ఉదయాన్నే లేచి 'శ్రీమంతుడు' సినిమా చూడ్డానికి వెళ్లాడన్నాడు. ఆ మాటకు వెంకయ్యతో పాటు అక్కడున్న వారంతా అవాక్కయ్యారు. మాకు ఎదురుగా స్వామి కనిపిస్తుంటే లేడంటావేం అని వెంకయ్య అడిగాడు. కేవలం మీరు విగ్రహాన్నే చూడగలరు, కాని నేను స్వామిని లైవ్‌లో చూడగలను, ఫేస్ టు ఫేస్ మాట్లాడగలను. ఆయన ఈరోజు శ్రీమంతుడు సినిమా చూసుకుని 'కోమల విలాస్'లో భోజనం చేసుకుని, 'మురళీకృష్ణ స్వీట్స్'లో మలైకాజా తిని వస్తాడంట. తిరుమలలో లడ్డు, పొంగలి రోజూ తినేవే కదా... అందుకే నెల్లూరు వంటకాలు రుచి చూసి వస్తానని నాతో చెప్పాడని వివేకా అన్నాడు. ఏ సబ్జెక్ట్‌పైనైనా వివేకా వెటకారంగా మాట్లాడేది అలవాటే కాబట్టి, ఇది కూడా వెటకారంగానే మాట్లాడుతున్నాడనుకుని వెంకయ్య సైలెంట్ అయిపోయాడు.

★ ★ ★ ★ ★

అన్ని సేవలు అయిపోయాక చివరగా ఏకాంత సేవ మొదలైంది. స్వామి అమ్మవార్లను పవళింపు శయనంపై పడుకోబెట్టి పురోహితులు ఏకాంత సేవ చేస్తున్నారు. అయితే ఒంటి మీద ఎవరో కొట్టుకుంటున్నట్లు అక్కడ శబ్దాలు రాసాగాయి. అవి కంటికి కనిపించట్లేదు. పురోహితులకు అర్థం కాలేదు. వెంకయ్య, ప్రభాకర్‌రెడ్డి, నారాయణలు ఆ శబ్దాలు వింటూ... ఇదేదో స్వామివారి మహిమ అనుకోసాగారు. అదంతా చూస్తున్న వివేకా... చూడండి స్వాములు, మీరు పాడే పాటలను స్వామి ఆలకించడం లేదు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ దోమలు ఒంటి మీద వాలి ఆయన్ను గాయపరుస్తున్నాయి. దోమలు వాలినప్పుడల్లా ఆయన చేత్తో ఒంటి మీద కొట్టుకుంటున్నాడు... అవే ఈ శబ్దాలు... అంటూ అప్పుడే ఓ మస్కిటోకాయిల్ వెలిగించి స్వామి వద్ద పెట్టాడు. కొద్ది సేపటికి ఆ శబ్దాలు ఆగిపోయాయి. అప్పుడు అందరూ వివేకా చెప్పింది నమ్మారు... నిజమైన భక్తుడంటే ఇతనేరా... అనుకుంటూ అతని వైపు భక్తి భావంతో చూసారు.



# రేషన్ బియ్యంతో కోట్లు గడిస్తున్న రైస్ మిల్లర్లు

- కావలి కేంద్రంగా భారీగా రేషన్ బియ్యం కొనుగోళ్లు
- గుట్టు చప్పుడు కాకుండా పొరుగు రాష్ట్రాలకు తరలింపు

కావలి కేంద్రంగా నిత్యం టన్నుల కొద్ది రేషన్ బియ్యం పరిసరాలలోని రైస్ మిల్లులకు దిగుమతి అవుతున్నాయి. కావలి ప్రాంతంలో సుమారు 20 రైస్‌మిల్లులు ఉండగా వీటిలో 10 రైస్‌మిల్లులు ట్రేడింగ్ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. ఈ రైస్ మిల్లుల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులో వేసి ఆడించి ఆ బియ్యాన్ని సివిల్ సప్లై గోడౌన్స్‌కు తరలిస్తారు. ప్రభుత్వానికి సరఫరా చేసే సిఎంఆర్ బియ్యంలో వీరు అక్రమంగా కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని పాలిష్ వేసి కలిపి కల్తీ చేసి సివిల్ సప్లై గోడౌన్స్‌కు తరలిస్తారు.

అయితే ఈ క్రమంలో సివల్ సప్లై, రెవెన్యూ అధికారులకు ఈ భాగోతం అంతా తెలిసినా ఎప్పటికప్పుడు మిల్లుల యజమానులు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తిపడి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో రైస్‌మిల్లర్లు రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసేందుకు తెగబడుతున్నారు. భారీగా అక్రమ రేషన్ బియ్యం వస్తే గుట్టు చప్పుడు కాకుండా ప్రక్క రాష్ట్రాలకు సైతం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా పాలిష్ పెట్టిన రేషన్ బియ్యాన్ని మేలైన రకం బియ్యంలో కలిపి అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ సంవత్సరానికి కావలసిన ధాన్యాన్ని ఆ సంవత్సరం కొనుగోలు చేసి సిఎంఆర్ రైస్ కొరకు ట్రేడింగ్ మిల్లులకు అప్పగిస్తే, దాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు రైస్ మిల్లర్లు అక్రమ సంపాదనకు తెరలేపుతున్నారు. దీనివలన పేదలకు చేరే రేషన్ బియ్యం పదేపదే మిల్లులలో మారి అదే బియ్యం వారికి చేరుతుంది. అప్పటికి రేషన్ బియ్యం పూర్తిగా నాణ్యత లోపిస్తుంది. అందువల్ల వారు కూడా తినలేని పరిస్థితి ఏర్పడి మరలా వ్యాపారస్తులకు అమ్మేందుకు సిద్ధపడుతున్నారు. ఈ రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం ఒక్క రూపాయికి ఇవ్వగా మిల్లర్లు ఒక్క కేజీ రూ.10 లెక్కన కొనుగోలు చేసి మంచి బియ్యంలో కలిపి రూ.40కి అమ్ముతూ కోట్లు గడిస్తున్నారు. ముఖ్యంగా కలిగిరి, కొండాపురం, వింజమూరు, వరికుంటపాడు మండలాలతో పాటు ప్రకాశం జిల్లా నుండి గుడ్లూరు, కందుకూరు, పామూరు, కనిగిరి, లింగసముద్రం మండలాల నుండి రేషన్ బియ్యం అక్రమంగా కావలిలోని జాతీయ రహదారి ప్రక్కనున్న రైస్ మిల్లులకు వస్తుంటాయి. సివిల్ సప్లై అధికారులకు ఏఏ రైస్ మిల్లులలో అక్రమ రైస్ నిల్వ ఉంటుందని తెలిసినప్పటికీ పట్టించుకోరు. అదే విషయాన్ని ఎవరైనా సమాచారం అందిస్తే ఆ రైస్ మిల్లు వద్దకు చేరుకుని ముందు హడావిడి చేసి రహస్యంగా తనిఖీలు చేసి ఉన్న బియ్యాన్ని కూడా లేనట్లు చూపిస్తూ కేసులను ప్రక్కదారి పట్టిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులే వారికి రక్షణగా మారడంతో వారి ఆగడాలకు అంతం లేకుండా పోయిందని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో పాతవూరు వద్ద రైస్‌మిల్లులో టన్నుల కొద్ది రేషన్ బియ్యాన్ని పట్టుకున్నప్పటికీ రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ఆ మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారే గాని, నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకోవడంలో ఆంతర్యం ఏంటో అర్ధమౌతుంది. తుమ్మలపెంట రోడ్డులో పోలీసులు నిఘాపెట్టి రెండు టర్బో లారీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నప్పటికీ సమాచారం బయటకు రానీయకుండా బియ్యాన్ని సివిల్ సప్లై వారికి అప్పగించి చేతులు దులుపుకున్నారు. ఇటీవల మద్దూరుపాడులోని రైస్ మిల్లులో, వడ్డిపాళెంలోని రైస్‌మిల్లులో భారీగా రేషన్ బియ్యాన్ని పట్టుకున్నప్పటికీ నామమాత్రపు కేసులను నమోదు చేసి, చర్యలు తీసుకోలేదు. ఇకనైనా ఉన్నతస్థాయి అధికారులు అక్రమ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న రైస్ మిల్లులపై గట్టి చర్యలు తీసుకుంటే పేదవాడికి చేరే రేషన్ బియ్యం నాణ్యతతో సరఫరా అవుతుందని ప్రజలు కోరుతున్నారు.


# ఉత్తరక్రియలు



మా తల్లిగారైన

**శ్రీమతి మోపూరు యర్రమ్మ గారు**

(W/o. లేట్ మోపూరు వెంకటనరసయ్య)

తేది. 28-07-2015 మంగళవారం స్వర్గస్తురాలైనారు.

వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు:

మోపూరు పెంచలయ్య (అలంకార్) రాజీయాడ్స్

మోపూరు మోహన్ కుమార్, చీఫ్ ఇంజనీర్, ONGC

**పెద్దకర్మ**

తేది. 15-08-2015 శనివారం ఉదయం 10-00 గంటలకు నెల్లూరు, మూలాపేట, అలంకార్ సెంటర్ సమీపంలోని మా స్వగృహమునందు జరుగును. కావున తెలియజేయడమైనది.




## కావలి కబుర్లు

# త్వరలో దుగరాజపట్నం ఓడరేవు

**- వెంకయ్యనాయుడు**



నెల్లూరుజిల్లాలోని దుగరాజపట్నం వద్ద ఓడరేవు నిర్మాణానికి పని ప్రారంభించడానికి త్వరలో తేదీని నిర్ణయించనున్నట్లు కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు న్యూఢిల్లీలో ఇటీవల ఆయనను కలిసిన సందర్భంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కందుకూరి వెంకటసత్యనారాయణకు తెలియజేసినట్లు కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సి.వి.సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నట్లు వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారని తెలిపారు. ప్రకాశం జిల్లా రామాయపట్నం ఓడరేవు నిర్మాణం విషయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ నిశితంగా పరిశీలిస్తున్నారని, త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటామని వెంకయ్యనాయుడు తెలిపారని పేర్కొన్నారు. బిట్రగుంట వద్ద రైల్వేశాఖ ఆధ్వర్యంలో ఏ పరిశ్రమ పెట్టాలన్న విషయంలో ఇంకా నిర్ణయం జరగలేదని, ప్రస్తుతం పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టినందు వల్ల కొంత జాప్యం జరుగుతుందని వెంకయ్యనాయుడు వివరించారని తెలిపారు. కావలిలో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేదని వెంకయ్య హామీ ఇచ్చినట్లు తెలిపారు. సూపర్‌ఫాస్ట్ రైళ్లు కావలిలో నిలిపే విషయం రైల్వేబోర్డు పరిశీలనకు పంపినట్లు కూడా తెలిపినట్లు చెప్పారు.

# ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ హక్కు



ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ హక్కు అని సిపిఐ పట్టణ కార్యదర్శి దేగా సత్యనారాయణ అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా కావాలని కోరుతూ మంగళవారం సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. దీంతో పట్టణంలోని కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, వస్త్ర వ్యాపారులు స్వచ్ఛంధంగా మూసి బంద్ పాటించారు. ఉదయం ఆర్టీసీ బస్సు రాకపోకలను అడ్డుకుని బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. పట్టణంలో సిపిఐ, సిపిఎం నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వద్ద రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా దేగా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగాక ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తెలుగుదేశం, భారతీయ జనతాపార్టీలు ఆంధ్రాకు ప్రత్యేకహోదా కల్పిస్తామని ఓట్లు వేయించుకుని, అధికారంలోకి రాగానే మాట తప్పాయని విమర్శించారు. ప్రత్యేకహోదా వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సిపిఎం డివిజన్ కార్యదర్శి టి.మాల్యాద్రి మాట్లాడుతూ వెంటనే ప్రత్యేకహోదా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బాలకోటయ్య, వెంకటేశ్వర్లు, నీలం వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు పెంచలయ్య, మల్లికార్జునరావు, ప్రజాసంఘాల నాయకులు రవికుమార్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# మద్దూరుపాడులో అనుమానాస్పద మృతదేహం



కావలి పట్టణ సమీపంలోని మద్దూరుపాడు వద్ద వున్న విజయ డైరీకి తూర్పుపొలాలలో అనుమానాస్పద మృతదేహం వెలుగుచూసింది. విషయం తెలుసుకున్న కావలి రూరల్ సిఐ ఎం.మధుబాబు, ఎస్ఐ సుబ్బారావులు అక్కడకు చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి సుమారు 55సంవత్సరాలు వుండవచ్చని, గుర్తు తెలియని వ్యక్తిగా భావిస్తున్నారు. మృతుడి జేబులో 60రూపాయలు వున్నట్లు గుర్తించారు. సంఘటనా స్థలంలో ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడు ధరించిన చొక్కాపై ఒంగోలు టైలర్ అని గుర్తు ఉంది. మృతుడు ఎరుపురంగు చొక్కా, నలుపు, నీలిరంగు లుంగీ ధరించి ఉన్నాడు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కార్పొరేటర్‌కు కోటిరూపాయలివ్వాలి

నెల్లూరు నగరాభివృద్ధిలో భాగంగా ఒక్కో కార్పొరేటర్‌కు కోటి రూపాయలు ఇవ్వాలని టిడిపి రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం 34వ డివిజన్ పరిధిలో రూ. 14.76లక్షలతో సిసిరోడ్లు, మురుగుకాలువల నిర్మాణ పనులకు నగర మేయర్ అబ్దుల్ అజీజ్, కార్పొరేటర్ పెంచలయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ నిధుల మంజూరు కోసం మంత్రి నారాయణపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజికి రూ.1100కోట్లను కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళపాక అనూరాధ, నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రూరల్ కన్వీనర్ కిలారి వెంకటస్వామినాయుడు, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

ఏడాది క్రితం ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించిన చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ ఫలాలను పేదలకు అందజేసిన ఘనత తెలుగుదేశంపార్టీకి దక్కిందని కోవూరు శాసనసభ్యుడు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. విడవలూరు మండలం పరిధిలోని వావిళ్ల, దంపూరు గ్రామంలో ఆదివారం జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో పింఛన్‌లు, వివిధ శాఖలకు జీతాల పెంపు, విద్యుత్ మెరుగు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, విద్యార్థులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్‌లు పెంపు ఇటీవల అంగన్‌వాడీ వర్కర్లకు జీతాల పెంపు, పక్కాగృహాలకు నిధుల మంజూరు... ఇలాంటి ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ ఎస్.కె.బషీర్, ఎంపిడిఓ విజయ్‌కుమార్ జిల్లా తెలుగుయువత అధ్యక్షులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, జడ్పీటీసీ రమాదేవి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు చెంతకే ప్రభుత్వం




ప్రతి గ్రామంలోని రైతులు 'మీ ఇంటికి - మీ భూమి' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసే గ్రామసభలను సద్వినియోగ పరచుకుని తమ భూ సమస్యలు పరిష్క రించుకోవలసిందిగా రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు.

సోమవారం దక్కిలి మండలం తీర్థం పాడు గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన 'మీ ఇంటికి - మీ భూమి' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి విశాఖపట్నం జిల్లాలోని శంఖారావం గ్రామంలో ప్రారంభించారన్నారు. జూన్ 12వ తేదీన మీ ఇంటికి - మీ భూమి కార్యక్రమాన్ని ఆన్‌లైన్లో పొందు పరచి 325లక్షల రైతు ఖాతాలను నమోదు చేయడం జరిగిందన్నారు. మీ ఇంటికి - మీ భూమి కార్యక్రమం క్రింద 1బి ఖాతానకలు ప్రింటు తీసి గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బంది ద్వారా సంబంధిత రైతుకు వారి ఇంటి వద్దనే అందజేయడం జరుగుతుందన్నారు. రైతు భూమికి సంబంధించిన వివరాలు సక్రమంగా ఉన్నట్లు గమనించినచో ధృవీకరణ చేస్తామన్నారు. అలా లేని పక్షంలో రెవెన్యూ సిబ్బంది ద్వారా జారీ చేయడానికి ధరఖాస్తును తీసుకొని, దానిని పూరించి సంబంధిత మార్పులకు తగిన ఆధారాలు జతచేసి ఇస్తే రెవెన్యూ విచారణ ద్వారా సరి చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు 75వేల మంది రైతులు కంప్యూటర్లలో డేటాను నమోదు చేసుకొం టున్నారన్నారు. 39లక్షల మంది రైతులు సరిచేసిన వివరాలను ఆన్‌లైన్లో చూసుకుం టున్నారన్నారు. వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ మీ ఇంటికి - మీ భూమి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ.యం.డి.ఇంతియాజ్, గూడూరు సబ్ కలెక్టర్ గిరీషా పి.యస్, మాజీమంత్రి పరసారత్నం, ఏఎంసి ఛైర్మెన్ ప్రసాద్ నాయుడు, వెంకటగిరి మున్సిపల్ ఛైర్మెన్ శ్రీమతి డి.శారద, జడ్పీటీసీ రామ చంద్రయ్య, ఎంపిటిసి పోలంరెడ్డి వెంకట రెడ్డి, సర్పంచ్ జగన్మోహన్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తెంచుకుంటాడా?

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ పీకల లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఆస్తులు తెలంగాణకిచ్చి అప్పుల చిట్టాను ఆంధ్ర ముఖాన పడేసారు. ఈ కష్టాల నుండి గట్టెక్కాలంటే ఇప్పట్లో అయ్యే పని కాదు. కేంద్రం పార్లమెంటులో చెప్పిన ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తేగాని కొంతన్నా కోలుకునే పరిస్థితి ఉండదు. ప్రత్యేకహోదా వస్తే పన్నులు తగ్గుతాయి. ప్రజలపై కొంత భారం తగ్గుతుంది. పరిశ్రమలు, సెజ్‌లు వస్తాయి. రాష్ట్రం అభివృద్ధి పరంగా ముందుకు పోతుంది. కేంద్రం మాత్రం ప్రత్యేకహోదా ప్రస్తావనే ఎత్తడం లేదు. ఇక ఏ రాష్ట్రానికి కూడా ఇది ఇచ్చేది లేదంటున్నారు. ఆంధ్రప్రదేశ్ దుస్థితి వేరు... మిగతా రాష్ట్రాల పరిస్థితి వేరు. కేంద్రం దీనిని గమనించడం లేదు. అదేదో ముష్టివాళ్లమన్నట్లు ఆర్థిక ప్యాకేజీ ఇస్తామంటున్నారు. అలాంటి ప్యాకేజీల వల్ల రాష్ట్రానికి ఒరిగేదేమీ ఉండదు. కొత్తగా వచ్చే అభివృద్ధి వల్లే ఈ రాష్ట్ర ప్రజలకు ఉపశమనం కలుగుతుంది. ఇక్కడ పరిశ్రమలు రావాలి, ప్రాజెక్టులు రావాలి. ఉపాధి అవకాశాలు మెరుగుపడాలి. విద్యావకాశాలను పెంపొందించాలి, వైద్య సౌకర్యాలను పెంచాలి. అన్ని వర్గాల ప్రజలు ప్రయోజనం పొందే విధంగా అభివృద్ధి జరగాలి. దానికున్న ఏకైక మార్గం ప్రత్యేకహోదా!

అయితే, కేంద్రం ప్రత్యేకహోదా ఇచ్చే అవకాశమే కనిపించడం లేదు. చంద్రబాబు అవసరమైన ప్రత్యేకహోదా, పోలవరం, జాతీయ విద్య, వైద్య సంస్థల ఏర్పాటు వంటి అంశాలను వదిలేసి ప్రజలకు ఎంతమాత్రం అవసరంలేని పుష్కరాలు, సింగపూర్ రాజధాని, పట్టిసీమ వంటి వాటిని పట్టుకుని వేలాడుతున్నాడు.

ప్రత్యేకహోదాపై చంద్రబాబు కళ్లు తెరవాలి. కేంద్రంతో పోరాడైనా ప్రత్యేకహోదా సాధించాలి. అవసరమైతే కేంద్రంతో తగువుకు, తెగదెంపులకు కూడా సిద్ధపడాలి. ప్రత్యేకహోదాపై ఆయన ఏ మాత్రం మౌనంగా వున్నా రాష్ట్ర ప్రజల దృష్టిలో కాంగ్రెస్‌లాగే చరిత్ర హీనుడవుతాడు.

# రాత్రి సూర్యుళ్ళు

- చిన్ని నారాయణరావు
94402 02942

తరతరాల ఆవేదనల రాశుల్ని
అంతరంగంలో పొదివి పొట్టుకొని
కునుకులేని కనురెప్పల మాటున
నిశరాత్రి వేదనల్ని నిక్షిప్తం చేసుకొని
బాధల గాధల లావాల్ని పంటిబిగువున
అదిమి పట్టి -
కాపలాలకు వకాల్తాగా నిలచేవాళ్ళు
అంతులేని అలజడిని మోసే 'శివయ్య'లు వాళ్ళు
అభద్రతా కత్తిమీద సాము చేసే
సర్కస్ ఫీటు వారి జీవితం
ధరల యుద్ధంతో పోరాటం చేసి
తారాజువ్వలై నింగికెగసి
అలసి సొలసి నేలకూలే జనం
వాళ్ళ గొయ్యి వాళ్ళే తవ్వుకొని
వాళ్ళ సమాధిని వాళ్ళే నిర్మించుకొనే
(ఇన్) సెక్యూరిటీ గార్డులు
వారి బ్రతుకు భవంతికి సెక్యూరిటీ కరువు
వారి జీవితాల్లో విలసిల్లెను పేదరికం దరువు
సమాజం కోసం నిత్యం 'పహారా' కాసేవాళ్ళు
జనం మధ్య తిరుగాడే -
సైనికులు కాని సైనికులు వాళ్ళు
కాలం కాలనాగై బుసలు కొడ్తున్నా
కాలానికి ఎదురీదుతున్న
సంద్రమంత ఆత్మవిశ్వాసం వారి సొంతం
కనురెప్పవాళ్ళని అసురత్వాన్ని ప్రదర్శిస్తూ
జాగరూకతే తమ అస్త్రంగా
ధిక్కార స్వరం విన్పించిన ధీరులువాళ్ళు
అదుపు తప్పిన సమాజాన్ని
తమ అదుపాజ్ఞలతో రక్షించే
రాత్రి సూర్యుళ్ళు వాళ్ళు
వేకువ కోసం ఆరుగాలాలు
ఎదురుచూస్తున్న వాళ్ళు
ఆకుల సవ్వడినే ఆరా తీసే
నిఖార్సయిన యూనిఫాంగాళ్ళు!

# డిఎం అండ్ హెచ్ఓ బదిలీ

నెల్లూరుజిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిణిగా పనిచేస్తున్న డాక్టర్ భారతీరెడ్డిని విశాఖపట్నం వైద్య మరియు ఆరోగ్యశాఖ ప్రాంతీయ శిక్షణ కార్యాలయానికి బదిలీ చేశారు. అక్కడ ఆమెకు ప్రిన్సిపల్‌గా బాధ్యతలను అప్పగించారు. అక్కడ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మి నెల్లూరు డిఎం & హెచ్ఓగా బదిలీపై వస్తున్నారు.

# జిల్లాలో ఆదర్శపాఠశాలలు

నెల్లూరుజిల్లాలో ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రతి పంచాయితీకి ఒక ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి పాఠశాలకు 80మంది విద్యార్థులకు తగ్గకుండా ఉండేలా చూడాలని జిల్లా విద్యాశాఖాధికారులకు ఉత్తర్వులు అందాయి. ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా నిర్ణయించారు. 80కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే ఒక ఇంగ్లీషు ఉపాధ్యాయుడును అదనంగా నియమించనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతియేటా విద్యార్థుల సంఖ్య తగ్గుతుండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# షాన్స్ దంత వైద్యశాల ప్రారంభం

నెల్లూరు పొగతోటలోని మాదాల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన 'డాక్టర్ షాన్స్ డెంటల్ అండ్ యాక్సిల్లోఫేషియల్ సెంటర్'ను ఈ నెల 10వతేదీ మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ జి.కొండారెడ్డి, ఏఐఎంఎస్‌ఏ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎ.తంగవేల్, మాజీ కార్పొరేటర్ పిండి సురేష్, షేక్ ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు. తమ హాస్పిటల్‌లో పళ్లకు సంబంధించిన అన్ని సమస్యలకు చికిత్స చేస్తామని, పళ్లు తీయడం, కొత్తవి అమర్చడం, వంకరటింకరలు సరిచేయడం వంటివన్నీ అత్యాధునిక పరిజ్ఞానంతో చేస్తామని ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ షాన్‌వాజ్ షేక్ తెలిపారు.

# 16న సాంస్కృతిక పోటీలు

శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకుని నెల్లూరులోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో ఈ నెల 16న విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించ నున్నట్లు ఇస్కాన్ మందిరం అధ్యక్షులు శ్రీ సుకదేవస్వామి తెలిపారు. ఆ రోజున ఉదయం 9 గంటలకు ఎల్‌కెజి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఫ్యాన్సీడ్రెస్ పోటీలు, 8 నుంచి 12 తరగతుల విద్యార్థులకు సంగీత పోటీలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు, 9 నుంచి 12 తరగతుల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఇస్కాన్ మందిరంలో జరిగే శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో బహుమతులను ప్రదానం చేస్తామని, పోటీల్లో ఆసక్తివున్నవారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# వేగం పెంచిన జగన్!

(మొదటి పేజీ తరువాయి)

అధికారంకన్నా ముందు ప్రజలు ఆయనకు ఓ బాధ్యత అప్పగించారు. ఈ బాధ్యతను జగన్ ఎంతవరకు సమర్థవంతంగా నెరవేరుస్తున్నాడని ప్రజలు అనుక్షణం గమనిస్తూనే వున్నారు. ప్రతిపక్ష నేతగా జగన్ తొలిరోజుల్లో కొంత బలహీనంగా కనిపించాడు. రాజధానికి భూసేకరణ విషయంలో ఆయన రైతుల తరపున నిలబడి గట్టిగా పోరాడలేక పోయాడు. రాజధాని పేరుతో పచ్చటి పొలాల వినాశనానికి పాల్పడుతూ భూదోపిడీకి శ్రీకారం చుట్టిన చంద్రబాబు ప్రభుత్వ దుర్నీతిని ఎండగట్టడంలో జగన్ ప్రభావవంతమైన పోరు నడపలేదు. ఒకవేళ రాజధాని భూములపై పోరాడితే రాజధానికి ఎంపిక చేసిన గుంటూరు, కృష్ణా జిల్లాలో తన మీద వ్యతిరేకత వస్తుందనే భయం కావచ్చు.

ఆ విషయాన్ని పక్కనపెడితే మిగతా విషయాలలో ప్రతిపక్ష నేతగా జగన్‌లో వేగం పెరిగింది. పోలవరం, పట్టిసీమ, పుష్కరాల దుర్ఘటన వంటి వాటిలో ప్రతిపక్ష నేతగా జగన్ ప్రతిస్పందన ప్రజల ఆమోదం పొందింది. రాష్ట్రంలో ఇప్పుడు ప్రధాన అంశం ప్రత్యేకహోదాను సాధించడం. రాష్ట్ర ప్రభుత్వం దీని కోసంగా ఎటువంటి ప్రయత్నం చేయడం లేదు. ప్రతిపక్ష నేతగా జగన్ మాత్రం ఈ విషయంలో అటు కేంద్రంతోనూ, ఇటు రాష్ట్రంతోనూ పోరాటానికి సిద్ధమయ్యాడు. ప్రత్యేకహోదా కోసం ఆయన మొన్న ఢిల్లీలో చేపట్టిన ధర్నాకు సైతం అనూహ్య స్పందన వచ్చింది. జగన్ ఢిల్లీలో ధర్నాకు పూనుకున్నప్పటి నుండే ప్రత్యేకహోదాపై విపక్షాలు కదిలాయి. అలాగే రాష్ట్రంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా, ఏ సంఘటన చోటు చేసుకున్నా జగన్ వెంటనే వాలిపోతున్నాడు. అదే సమయంలో చంద్రబాబు విదేశాలలో ఉంటున్నాడు. ఈ తేడానే ప్రజల్లో చంద్రబాబు కంటే జగనే నయమనే అభిప్రాయం కలిగిస్తోంది.

# నెల్లూరులో చినరాజప్ప



రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప 13వ తేదీ నెల్లూరొచ్చారు. ఏ.సి. స్టేడియంలో జరుగుతున్న వెంకటేశ్వర వైభవోత్సవాలలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో కరువుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అగ్రిగోల్డ్, మనీస్కీం, ఎర్రచందనం అక్రమరవాణాపై తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. ర్యాగింగ్‌ను కఠినంగా అరికట్టాలంటూ ఆదేశించారు. ఆ తర్వాత బిట్రగుంటలో మోడల్ పోలీసు స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు.



ఈ నెల 12వ తేదీ కావలి వెంగళరావ్ నగర్‌లోని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాన్ని పరిశీలించి అక్కడే రాత్రి బస చేసిన కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

# ప్రగతిలో మేటి... శ్రీసిటీ

**- ఐటి మంత్రి ప్రశంస**



రాష్ట్ర ఐటి మరియు సమాచార శాఖామాత్యులు డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి సెజ్ అభివృద్ధిని, పరిశ్రమల ప్రగతిని వివరించారు. అనంతరం మంత్రి సెజ్ పరిసరాలు చుట్టిచూశారు. ఇక్కడ నూతనంగా ప్రారంభమైన ఫాక్స్‌కాన్ మొబైల్స్ పరిశ్రమను సందర్శించి దాని పనితీరును పరిశీలించారు. శ్రీసిటీ లాంటి భారీ పారిశ్రామికవాడ ఏర్పాటుకు కృషి చేసిన ఎండీ రవీంద్ర సన్నారెడ్డిని ఆయన అభినందించారు. ఐటి శాఖ మంత్రి శ్రీసిటీని సందర్శించడం, పరిశ్రమల తీరు గమనించడం తమకు చాలా సంతోషం కలిగిస్తోందని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. మంత్రితో పాటు ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి తదితరులు శ్రీసిటీని సందర్శించారు.

# యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా వినోద్



రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నెల్లూరుకు చెందిన కేతంరెడ్డి వినోద్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన కాంగ్రెస్‌పార్టీకి ఏపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఇన్‌వెంటివ్ యాడ్స్ వినోద్‌గా నెల్లూరులో అందరికీ సుపరిచితుడైన వినోద్‌రెడ్డి మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ముఖ్యఅనుచరుడు. విద్యార్థిగా ఎన్ఎస్‌యూఐలో చురుకుగా పని చేశారు. వివేకా అనుచరుడిగా కాంగ్రెస్‌లో చేరి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శిగా, ఇటీవల కాలం నుండి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర విభజన అనంతరం నెల్లూరులో చాలామంది నాయకులు వివేకాను వదిలేసి తెలుగుదేశం, వైకాపాలలో చేరిపోయారు. వినోద్ మాత్రం కాంగ్రెస్‌ను, అంతకంటే కూడా వివేకాను వదలకుండా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ కార్యక్రమాలను చురుకుగా నిర్వహిస్తున్నారు. ఏపి సోషల్ మీడియా కాంగ్రెస్ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ప్రచారం కల్పించడం ద్వారా జాతీయ కాంగ్రెస్ నాయకులకు సైతం దగ్గరయ్యారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com